# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 27-7-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 289 పేజీలు:6 వెల: రూ.1/-


## విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబాలకు చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ

### ఆర్థిక సహాయం అందించి హోమ్ గార్డ్సలను అభినందించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, జులై 26 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా లో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మర ణించిన హోమ్ గార్డ్స్ పి.మల్లేశం కుటుంబానికి తోటి హోంగార్డ్ లు తమ ఒక రోజు వేతనం 1,88,000/- రూపాయలు మరియు హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుండి 20,000/- రూపాయలుమరియు సంపత్ కుటుంబానికి హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుండి 15,000/- రూపాయలు) వారి కుటుంబా సభ్యులకు మంగళవారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే చేతుల మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇవ్వడం జరిగింది.పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ది సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

## కామారెడ్డి యువకుడికి మంకీపాక్స్ నెగెటివ్

హైదరాబాద్, జులై 26: కువైట్ నుంచి కామారెడ్డికి వచ్చిన యువకుడికి మంకీపాక్స్ నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. పుణెలోని ఎన్ఐవీ ల్యాబ్‌లో బాధిత యువకుడి నమూనాలను పరీక్షించగా నెగెటివ్ అని తేలింది. నిన్న ఫీవర్ ఆస్పత్రిలో చేరిన యువకుడి నుంచి ఐదు రకాల నమూనాలను సేకరించి.. పుణె ల్యాబ్‌కు పంపినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఈ నెల 6వ తేదీన కువైట్ నుంచి వచ్చిన ఆ యువకుడు తీవ్ర నీరసానికి గురయ్యాడు. జ్వరంతో బాధపడ్డాడు. దీంతో కామారెడ్డిలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు వెళ్లాడు. శరీరంపై ఉన్న దద్దుర్లు మంకీపాక్స్ మాదిరిగా ఉండటంతో నోడల్ కేంద్రంగా ఉన్న ఫీవర్ హాస్పిటల్‌కు వచ్చాడని డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. మొత్తంగా బాధిత యువకుడికి మంకీపాక్స్ నెగెటివ్ అని నిర్ధారణ కావడంతో అటు వైద్యులు, ఇటు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

మంకీపాక్స్ గురించి ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ శంకర్ స్పష్టం చేశారు. లక్షణాలు ఉన్న వ్యక్తికి దగ్గరగా ఉన్న వారికే మంకీపాక్స్ సోకే అవకాశం ఉందన్నారు. గాలి ద్వారా మంకీపాక్స్ సోకదని, పెద్దగా దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారానే సోకే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మంకీపాక్స్ లక్షణాలతో విదేశాల నుంచి వచ్చిన వారు సమాచారం ఇవ్వాలన్నారు. 6 నుంచి 13 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడుతాయని డాక్టర్ శంకర్ తెలిపారు.

## ఏపీపై కేఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు

హైదరాబాద్, జులై 26: కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. బ్రహ్మంసాగర్ ఎడమ కాల్వపై అక్రమంగా ఎత్తిపోతల నిర్మిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఏపీ ప్రభుత్వం బేసిన్ వెలుపలకు నీటిని తరలిస్తోందని తన లేఖలో తెలంగాణ ప్రభుత్వం పేర్కొన్నది. విభజన చట్టానికి విరుద్ధంగా కొత్త ప్రాజెక్టు చేపట్టడం సరికాదని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ చర్యలతో నాగార్జున సాగర్ ఆయకట్టుకు ఇబ్బంది ఏర్పడుతుందని పేర్కొన్నది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బంది కలుగుతుందని తెలిపింది. ఏపీ చేపట్టిన తెలుగు గంగ ప్రాజెక్టు విస్తరణ పనులను కూడా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

## రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీలపై సస్పెన్షన్

న్యూఢిల్లీ, జులై 26: రాజ్యసభ కార్యకలాపాలను అడ్డుకుంటున్న 19 మంది ఎంపీలపై వారం రోజుల పాటు సస్పెన్షన్ విధించారు. సభకు ఆటంకం కలిగిస్తున్న కారణంగా వారిపై వేటు వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ తెలిపారు. వెల్‌లోకి దూసుకెళ్లిన ఎంపీలు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. జీఎస్టీ, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలపై చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్రలను వారం పాటు సస్పెండ్ చేశారు. టీఎంసీ ఎంపీలు సుస్మితా దేవ్, డాక్టర్ సంతనూ సేన్, డోలా సేన్‌లతో పాటు ఇతర ఎంపీలపై కూడా వారం పాటు సస్పెన్షన్ విధించారు. వేటు పడిన వారిలో కాంగ్రెస్, డీఎంకే ఎంపీలు కూడా ఉన్నారు.

సోమవారం లోక్‌సభలో నలుగురు కాంగ్రెస్ ఎంపీలను వర్షాకాల సమావేశాల నుంచి పూర్తిగా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సభలో ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టినందుకు వారిపై ఆ సస్పెన్షన్ విధించారు. ధరల పెరుగుదల, జీఎస్టీ లాంటి అంశాలను చర్చించాలని విపక్షాలు ఉభయసభల్లోనూ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 12వ తేదీ వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.

## ఈసీ వాగులో చిక్కుకున్న యువకుడు.. రక్షించిన ట్రాఫిక్ పోలీసులు..

రంగారెడ్డి, జులై 26: హైదరాబాద్ నగర శివారులో ఉన్న హిమాయత్ సాగర్‌కు వరద పోటెత్తింది. దీంతో ఆ ప్రాజెక్టు ఆరు గేట్లు ఆరు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో ఈసీ వాగు ఉప్పొంగింది. దర్గా వంతెన వద్ద ఈసీ వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పటికీ.. సర్వీస్ రోడ్డుపై ఓ వాహనదారుడు తన బైక్‌ను ముందుకు పోనిచ్చాడు. సర్వీస్ రోడ్డు మధ్యలోనే ఆ యువకుడు ఆగిపోయాడు.

అయితే ఆ రహదారికి ఇరువైపులా ఇనుప గ్రిల్స్ ఉండటంతో ఆ వాహనదారుడు ప్రాణాలతో బయటపడ్డాడు. బైక్ ఆ గ్రిల్స్‌కు అనుకోవడంతో అది కిందకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. అతను కూడా గ్రిల్స్ ను ఆసరాగా చేసుకొని అక్కడే ఉండిపోయాడు. ఒక వేళ ఇనుప గ్రిల్స్ లేకపోయి ఉంటే అతను కొట్టుకుపోయేవాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. బాధితుడిని ప్రాణాలతో కాపాడారు.

### చరిత్రలో నేటినిజం




(జులై 27 గాయని కే.ఎస్. చిత్ర జననం..) -రాధశ్రీ

సెల్: 9494481210

## ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి : సీఎస్ సోమేశ్ కుమార్



హైదరాబాద్, జులై 26: రాష్ట్రంలో వర్షాలు, వరదలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంటువ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని సీఎస్ పేర్కొన్నారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. ఉస్మాన్, హిమాయత్ సాగర్లకు వరద అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. జలాశయాలు, చెరువులకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, వంతెనలు తెగిన మార్గాల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని సీఎస్ ఆదేశించారు.

సీఎస్ సోమేశ్ కుమార్ నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, అడిషనల్ డీజీపీ జితేందర్, ఫైర్ సర్వీసుల డీజీ సంజయ్ జైన్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, దక్షిణ మండలం విద్యుత్ పంపిణి సంస్థ సీఎండీ రఘుమా రెడ్డి, ఉత్తర మండలం విద్యుత్ పంపిణి సంస్థ సీఎండీ గోపాల్ రావు పాల్గొన్నారు.

## నేచర్ క్యూర్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తాం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జులై 26: అమీర్‌పేటలోని గాంధీ నేచర్ క్యూర్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఆ హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు, వసతులు కల్పించాలని అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు. దేశంలో ఎంతో ప్రాముఖ్యత పొందిన గాంధీ నేచర్ క్యూర్ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన ప్రకృతి వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

నేచురోపతి వైద్యంపై నిర్వహించిన సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుతో పాటు వైద్యారోగ్య శాఖ సెక్రెటరీ రిజ్వి, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ప్రకృతి వైద్య నిపుణులు మంథని సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజల్లో నేచురోపతి (ప్రకృతి ) వైద్యం పైన పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా నేచర్ క్యూర్ ఆసుపత్రిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అందుకు కావాల్సిన సదుపాయాలు, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైద్యంలో ప్రసిద్ధి పొందిన మంథని సత్యనారాయణ సలహాలు, సూచనలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. నేచర్ క్యూర్ విభాగం నుండి ప్రత్యేక బృందాన్ని విజయవాడలోని మంథని సత్యనారాయణ నేచురోపతి ఆసుపత్రిని పంపాలన్నారు. అక్కడ అందుతున్న సేవలు, భోజన డైట్, ఇతర సదుపాయాల గురించి పూర్తిగా అధ్యయనం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



నేచర్ క్యూర్ ఆసుపత్రిలో నేచురోపతి ఓపీ, ఐపీ సేవలను మరింత మెరుగుపరిచి, అందుకు అనుగుణంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వైద్యం కాబట్టి హాస్పిటల్‌లో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వచ్చదనాన్ని పెంచాలని మంత్రి సూచించారు. అదేవిధంగా నేచురోపతికి ప్రత్యేక భోజన డైట్ ఉంటుంది కాబట్టి వాటికి కావాల్సిన వంట గది, సామాగ్రి సమకూర్చాలన్నారు. రోగులకు సేవలు అందించేందుకు సరిపడా వైద్యులను, సిబ్బందిని పెంచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## హ్యాండ్ బాల్ ప్లేయర్ మడావి కరీనాను అభినందించిన మంత్రి సత్యవతి

హైదరాబాద్, జులై 26: ఐహెచ్ఎఫ్ మహిళల యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు నేషనల్ యూత్ ఉమెన్ హ్యాండ్ బాల్ టీమ్ ప్లేయర్‌గా ఎంపికైన మడావి కరీనాను రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించారు. ఈ సందర్భంగా కరీనాను శాలువాతో సత్కరించారు. ఈ పోటీలు జులై 30 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు నార్త్ మెసిడోనియాలోని స్కోప్జేలో జరగనున్నాయి.

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం చిచ్చుపల్లి గ్రామానికి చెందిన మడావి కరీనా.. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో సీఈసీ సెకండియర్ చదువుతోంది.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో క్రీడా రంగానికి పెద్దపీట వేశారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను, కోచ్ లను ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామంలో జన్మించిన కరీనా అంతర్జాతీయ స్థాయి ఆటలకు సెలెక్ట్ అవడం చాలా సంతోషకరమని, తనకు ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో ట్రైబల్ వేల్ఫేర్ రీజనల్ కోఆర్డినేటర్ గంగాధర్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రమేష్, ప్రిన్సిపల్ రమ్య, కోచ్ అరవింద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కే రాకేష్, డైరెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

కరీంనగర్ , జులై 26: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మంగళవారం నాడు నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కరీంనగర్ లోని పద్మనాయక కళ్యాణ మండపం ఆవరణలో ఈ జాబ్ మేళా ను నిర్వహించారు.

70 కి పైగా మల్టీ నేషనల్ ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు విచ్చేసి ఇంటర్వ్యూలను నిర్వహించారు. 3వేల మందికు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు నిర్వహించిన ఈ మేళాకు 5 వేలకు పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ కొనసాగింది. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, నర్సింగ్ విభాగాల్లో విద్యార్హతలు కలిగి ఉన్న యువత ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం లో ఉద్యోగాల నియామకం కోసం కూడా ఇంటర్వ్యూలు జరిగాయి.

### 3 వేల ఉద్యోగ అవకాశాలు

ఈ సందర్భంగా పైన పేర్కొన్న విభాగాల్లో 3 వేల మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన అనేకమందికి విద్యాభ్యాసం కొనసాగించేందుకు కూడా సమయాలు లభించే ఉద్యోగాలు లభించాయి.

### జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలి-రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ నిరుద్యోగులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. 20 నుండి 30% వరకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని మిగతా 70 శాతం అవకాశాలు ప్రైవేటు రంగాల్లో ఉంటాయని తెలిపారు. ఒకవక్క శాంతిభద్ర విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే మరోపక్క కమిషనరేట్ పోలీసులు నిరుద్యోగుల కోసం ఈ మెగా జాబ్ మేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు. శాంతియుత వాతావరణం నిర్మాణం ద్వారానే అభివృద్ధి ముందుకు సాగుతూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఒకే వేదికపై నుండి వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు పోలీస్ శాఖ ఈ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణం అన్నారు.జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగ,ఉపాధి అవకాశాలను సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తులు చేసిన సందర్భాల్లో 5 నుండి 10 గంటల పాటు ఏకాగ్రతతో చదివినట్లయితే విజయం సాధిస్తారని చెప్పారు. పట్టుదలతో ప్రయత్నించకపోతే ఏది సాధించలేరనిపేర్కొన్నారు.పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ యువత సమయాన్ని వృధా చేయకూడదన్నారు.



పాశ్చాత్తా దేశాల్లో యువత విద్యాభ్యాసాలు పూర్తయిన తర్వాత ఎవరిపై ఆధారకుండా పట్టుదలతో ప్రయత్నించి ఉద్యోగాలను సాధించి జీవితాల్లో స్థిరపడుతారని చెప్పారు. అత్యున్నత స్థానాల్లో కొనసాగేందుకు కృషి చేయాలని తెలిపారు. భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రయోజకులై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ తోట రాములు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రాజు, అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్ (ఎల్ అండ్ ఓ) జి చంద్రమోహన్ (పరిపాలన) ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, విజయకుమార్, సి ప్రతాప్, ఎస్బిఐ జి వెంకటేశ్వర్లతో పాటుగా పలువురు పోలీసు అధికారులు, ఎన్ సిసి క్యాడేట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్లుగా పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనర్ ఉ మోటివేటర్ స్పీకర్ రఘురామరాజు, చందర్ లు వ్యవహరించారు.

## అన్ని పశువైద్య శాలల్లో మందులు అందుబాటులో ఉండాలి : మంత్రి తలసాని



హైదరాబాద్, జులై 26: రాష్ట్రంలోని అన్ని పశువైద్య శాలల్లో జీవాలకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మత్స్య భవన్ నుంచి అన్ని జిల్లాల పశువైద్యాదికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గొర్రెల పంపిణీలో అర్హులైన లబ్ధిదారులు అందరు 10 రోజులలో డీడీలు చెల్లించే విధంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో 554 పశువైద్యశాలలను అభివృద్ధి చేశాం. అవసరమైన ప్రాంతాలలో నూతన పశువైద్య శాలల నిర్మాణం చేపడతామని మంత్రి స్పష్టం చేశారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ పశుసంవర్ధక శాఖకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో మరణించిన జీవాలకు విపత్తుల నిర్వహణ శాఖ నుంచి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. గొర్రెల పెంపకం దారులకు మేలు చేసే విధంగా అన్ని సౌకర్యాలతో గొర్రెల మార్కెట్ ల ఏర్పాటు చేస్తామని మంత్రి తలసాని తెలిపారు.

## హైదరాబాద్ జంట జలాశయాలకు భారీ వరద.. గేట్లు ఎత్తివేత

హైదరాబాద్, జులై 26: భారీ వర్షాల నేపథ్యంలో హిమాయత్ సాగర్‌కు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు 4 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సోమవారం ఒక గేటును మాత్రమే ఎత్తి నీటిని విడుదల చేయగా, మంగళవారం ఉదయం మరో మూడు గేట్లను ఎత్తేశారు. హిమాయత్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1760 అడుగుల వద్ద ఉంది. ఇన్ ఫ్లో 1200 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 1320 క్యూసెక్కులుగా ఉంది.

ఉస్మాన్ సాగర్ 6 గేట్లు ఎత్తివేత

ఉస్మాన్ సాగర్‌కు కూడా వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు 6 గేట్లను ఆరు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1787 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 2,400 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 2,442 క్యూసెక్కులుగా ఉంది.

హుస్సేన్ సాగర్‌కు కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 513.41 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 513.48 మీటర్ల వద్ద ఉంది.

## చేవెళ్లలో 12 గంటలుగా కుండపోత వర్షం.. స్తంభించిన జనజీవనం

రంగారెడ్డి, జులై 26: జిల్లాలోని చేవెళ్ల మండలంలో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. 12 గంటలుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో మండల పరిధిలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లపై వరద ఉప్పొంగుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. గ్రామాల్లోకి కూడా వరద నీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వరద నీరు చేరింది.

దేవునిఎర్రవల్లి, తంగడిపల్లి టు అంతప్పగూడ, కుమ్మెర, అంతారం, కౌకుంట్ల, ఆలూరు, పామెన, దేవరంపల్లి తదితర ప్రధాన వాగుల్లోకి వరద కొనసాగుతూనే ఉంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని వివిధ వాగులను ఎంపీడీవో రాజ్‌కుమార్, తహసీల్దార్ వైఎస్.శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్ సందర్శించారు. దేవరంపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్‌లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని సూచించారు. దేవరంపల్లి సర్పంచి నరహరి రెడ్డి, ఖానాపూర్ సర్పంచి శ్రీలత ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.





# అతి సాధారణ దశ నుంచి అసాధారణ స్థాయికి ఎదగడమే జీవన సాఫల్యత

**(27 జూలై 'ఏ పి జే అబ్దుల్ కలాం వర్ధంతి' సందర్భంగా)**

భారత 11వ రాష్ట్రపతిగా (2002-07) విశిష్ట సేవలందించి 'ప్రజా ప్రసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలమైన రామేశ్వరం పట్టణంలోని పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ - జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు.

కష్టాల కడలిలో బాల్యం?:

రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు. అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని ఉద్భోధించారు.

భారత క్షిపణి పితామహుడిగా?.:

నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'భారత క్షిపణి పితామహుడు (మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా)'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్-? పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పాయిలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి సాటలైట్ లాంచింగ్ వెహికిల్ (యస్‌యల్‌వి-3)ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970-90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహికిల్), యస్‌యల్‌వి-3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ? 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వి' మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా?:

ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, రాజకీయవేత్తగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు. 'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. 1998లో చవకైన 'కలాం-రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం-రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన కలాం 'లీడ్ ఇండియా-2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు.

కలాంను వరించిన పురస్కారాలు?:

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజల ప్రసిడెంట్'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న' ఆవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. అనేక అగ్ర విద్యాసంస్థలు ఐఐయం, ఐఐయస్‌సి, ఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు. అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషణ్, పద్మ భూషన్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత ఆవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు ఆవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా-2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరుట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు.

విద్యార్థులతో ముచ్చటిస్తూనే?:

26 జూలై 2015న ఐఐయం, షిల్లాంగ్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ పి జె అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం. బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య అనే రెక్కలతోనే ఎదిగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం. 'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాడమే' అన్న కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా చేసేదని' నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# రూ.2కోట్ల విలువైన మద్యం ధ్వంసం



అమరావతి, జులై 26: దాదాపు రూ.2కోట్ల విలువ చేసే మద్యం బాటిళ్లను ధ్వంసం చేసిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి చేరవేస్తున్న అక్రమ మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. దాదాపు రూ.2 కోట్ల విలువైన 63 వేల మద్యం బాటిళ్లను పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ మద్యం అంతా గత రెండేండ్లుగా జిల్లాలో సీజ్ చేసినవి కావడం విశేషం. జిల్లాలోకి అక్రమంగా రవాణా చేస్తున్న అక్రమ మద్యం బాటిళ్లను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ధ్వంసం చేశారు. ఈ మద్యం విలువ దాదాపు రూ.2 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. గత రెండేండ్లుగా జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని సీజ్ చేశారు. ఈరోజు విజయవాడ శివారులోని రోడ్డుపై అక్రమ మద్యం బాటిళ్లను వరుసగా పేర్చి రోడ్డు రోలర్‌తో తొక్కించారు. స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసిన మద్యం బాటిళ్లలో చీప్ లిక్కర్ మొదలుకొని కాస్ట్‌లీ మందు కూడా ఉండటం విశేషం.

# విషాదంగా మారిన మ్యారేజ్ డే- బీచ్ లో గల్లంతయిన సాయిప్రియ

అమరావతి, జులై 26: మ్యారేజ్ డే విషాదంగా మారింది. భర్తతో కలిసి సరదాగా గడుదామని విశాఖలోని ఆర్కే బీచ్ కు వచ్చిన ఓ వివాహిత సముద్రంలో గల్లంతయింది. ఎన్ఏడీ ప్రాంతానికి చెందిన సాయిప్రియ తన భర్త శ్రీనివాస్ తో కలిసి ఆర్కే బీచ్ కు వచ్చింది. సముద్ర తీరంలో కాసేపు సరదాగా గడిపిన తర్వాత తిరిగి వెళ్లిపోవడానికి వారు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కాళ్లు కడుక్కోవడానికి సాయిప్రియ మళ్లీ సముద్ర తీరానికి వెళ్లింది. ఆ సమయంలో భర్త శ్రీనివాస్ సరిగా గమనించలేదు. కాసేపటి తర్వాత వెనక్కి తిరిగి చూడగా ఆమె కనిపించలేదు. ఈ విషయాన్ని వెంటనే ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆమె బీచ్ లో గల్లంతై ఉంటుందని అందరూ భావిస్తున్నారు. ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ
సంయుక్త ఆధ్వర్యంలో
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణ రెడ్డిగారి
91వ జయంతి సందర్భంగా


చారిత్రక నవలా చక్రవర్తి
ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌గారికి
సినారె-సాహితీ
పురస్కారం-బహూకరణ
శనివారం 30-07-2022 సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి
ముఖ్యఅతిథి : జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి, పూర్వ ప్రధాన న్యాయమూర్తి, పాట్నా హైకోర్టు
సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్దనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
గౌరవ అతిథి : డా॥ అక్కిరాజు సుందర రామ కృష్ణ, ప్రముఖ రంగస్థ, సినీ నటులు
ఆత్మీయ అతిథులు : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం
డా॥వి. భాస్కర్ రాజు, ఎం.ఎస్., ఆర్థోపెడిక్ సర్జన్, 'ధర్మమార్గం' టి.వి. ఛానల్ అధిపతి
సా॥ 7-30 గంటల నుండి
సినీ విజ్ఞానవిశారద శ్రీ ఎస్.వి. రామారావు రూపొందించిన
'సాహితీ సవ్యసాచి సినారె' లఘు చిత్రం ప్రదర్శన
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి), అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్, కార్యదర్శి, కిన్నెర
కళాశారద, కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# దేశీయ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలి - ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 25: భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ముందుగా దేశీయ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. విదేశాల్లో పర్యటించటం కంటే ముందు మన దేశంలో ఉన్న అందమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలకు వెళ్ళి, అక్కడి జీవన విధానాన్ని, గొప్పతనాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి పర్యాటకాల వల్ల ప్రజల మధ్య సంస్కృతి, అభిప్రాయాల మార్పిడి జరిగి జాతి ఐక్యత, సమగ్రత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.

"నార్త్ ఈస్ట్ ఆన్ వీల్స్" పేరిట ఈశాన్య భారతంలోని ఎనిమిది రాష్ట్రాల్లో పర్యటించిన 18 రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మహిళలు సహా 75 మంది బైకర్లతో న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు సంభాషించారు. ఇటీవలి తన ఈశాన్య రాష్ట్రాల పర్యటనను గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, అందమైన ప్రకృతి దృశ్యాలు, గొప్ప సంస్కృతి మరియు ప్రజల సహానుభూతి కలిగిన ఈశాన్య రాష్ట్రాలు పర్యాటక స్వర్గధామం అని తెలిపారు. ఇంత సుందరమైన పర్యాటక కేంద్రం గురించి ఇప్పటికీ చాలా మందికి తెలియదన్న ఆయన, పర్యాటక ప్రాంతాల మీద ఆసక్తి ఉన్న వారు ముందుగా ఈశాన్య భారతంలో పర్యటించి, మన సంస్కృతిలో వైవిధ్యాన్ని ఆస్వాదించటంతో పాటు అక్కడి ప్రకృతి అందాల గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయ రంగంలో భారతదేశానికి మార్గనిర్దేశం చేస్తున్న ఈశాన్య రాష్ట్రాలను అభినందించిన ఉపరాష్ట్రపతి, వారు పాటించే ఉత్తమ పద్ధతుల నుంచి నేర్చుకుని క్రమంగా స్థిరమైన సేంద్రీయ వ్యవసాయం దిశగా ప్రతి ఒక్కరూ మళ్ళాలని సూచించారు. ఈశాన్య ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రవాణా విషయంలో అభివృద్ధి గురించి ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, ఈ ప్రాంతం అభివృద్ధి విషయంలో నూతన శకానికి నాంది పలికిందని గుర్తు చేశారు.

ఈ పర్యటన నిర్వాహకులను అభినందించిన ఆయన, రహదారి భద్రత గురించి కూడా వారు దృష్టి సారించడం మంచి పరిణామం అని తెలిపారు. భారతదేశంలో చిన్న చిన్న పొరపాట్ల కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ధాన్యం మిల్లింగ్ పై సమీక్ష




కామారెడ్డి జిల్లా, 26 జులై, 2022 (నేటి నిజం ప్రతినిధి):-ప్రతిరోజు రైస్ మిల్లర్లు జిల్లాలో 8 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లు రైస్ మిల్లర్లు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దార్లుతో ధాన్యం మిల్లింగ్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్ యజమానులు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేయాలని సూచించారు. మిల్లుల వారీగా తడిచిపోయిన వరి ధాన్యం వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఇంచార్జ్ డిఎస్ఓ రాజశేఖర్, జిఎం జితేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# తొర్రూరు బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్..




మహబూబాబాద్, జులై 26 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో ఈ రోజు కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద కార్గిల్ అమర జవాన్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా శిక్షణ తరగతుల కన్వీనర్ పాకనాటి దామోదర్ రెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ దాయాది పాకిస్థాన్ మనదేశం పైన దొంగచాటుగా దాడికి యత్నించి కార్గిల్ యుద్ధం తో చిత్తు చిత్తుగా ఓడిపోయింది అని తెలిపారు.

ఈకార్గిల్ యుద్ధం లో మన దేశ సైనికులు వీరోచితంగా పోరాడి ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొని కార్గిల్ కొండల్లో భారత త్రివర్ణ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేసి భారత శౌర్య ప్రతాపాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. అప్పటి భారత ప్రధాని వాజ్ పాయ్ సైన్యానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి పాకిస్థాన్ మరియు వారి తొత్తులకు గట్టి హెచ్చరికలు చేసి పాక్ సైన్యాన్ని తరిమి తరిమి కొట్టారు అని తెలిపారు.

కార్గిల్ అమర జవాన్ల త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు పరుపాటి రాం మోహన్ రెడ్డి, రచ్చ కుమార్, బొచ్చు సురేష్, అలిసేరి రవిబాబు, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, రాయపురం రాజకుమార్, నడిగడ్డ ఉపేందర్, జలగం రవి, గట్ల భరత్, నూకల నవీన్, గంధం రాజు, కొమ్ము రాము, సుబ్రహ్మణ్యం, నడిగడ్డ సందీప్, వడ్లకొండ రవి, బూర్గు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అమెజాన్.ఇన్ పై మాన్సూన్ స్టోర్ లో డీల్స్..

హైదరాబాద్, జులై 26: అమెజాన్.ఇన్ పై మాన్సూన్ స్టోర్ తో వానాకాలానికి సిద్ధం అవ్వండి. వర్షాకాలానికి అవసరమైన రెయిన్ కోట్లు, ప్రొటెక్టర్లు, గృహసంరక్షణ, పెస్ట్ కంట్రోల్, ఎమర్జెన్సీ లైట్లు, వాటర్ ప్రూఫ్ బ్యూటీ, గ్రూమింగ్ ఉత్పత్తులు, ఆరోగ్యం, హైజీన్ సంపూరకాలు, హోమ్, కిచెన్ ఉపకరణాలు, ఇంకా మరెన్నో వస్తువులపై కస్టమర్లు బోలెడన్ని ఉత్కంఠభరితైన ఆఫర్లు, డీల్సును కస్టమర్లు పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డ్, క్రెడిట్ ఈఎంఐ, సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ ఈఎంఐ ని 2022 జూలై 25 నుండి 29వ తేదీ మధ్య ఉపయోగించడం ద్వారా కస్టమర్‌లు అదనంగా 10శాతం ఆదా చేసుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది. వివిధ రకాల విభాగాల్లో వాటర్ రెసిస్టెంట్ బ్యాగ్ లు, వాటర్ ప్రూఫ్ గాజెట్లు-, స్మార్ట్ వాచ్ లు, ఫిట్ నెస్ ఉపకరణాలు, వాషింగ్ మెషీన్లు, ప్రయాణపు లగేజ్, యాక్సెసరీలు, మొదలైన వాటి పై గొప్ప ఆఫర్లు పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది.

# ఆగస్టు 1 నుంచి ఏపీలో రేషన్ బియ్యం పంపిణీ

అమరావతి, జులై 26: ఏపీలో నాలుగు నెలలుగా నిలిపివేసిన రేషన్ బియ్యం పంపిణీని ఆగస్టు 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్రంలో కోటి 46 లక్షల రేషన్ కార్డులుంటే కేంద్రం 89 లక్షల కార్డులకు మాత్రమే బియ్యం ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ఇచ్చే 89 లక్షల కార్డులకి బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు.

వెనుకబడ్డ తొమ్మిది జిల్లాలు, ఎస్సీ, ఎస్టీలకు బియ్యం అందిస్తామన్నారు. ప్రతి నెలా ఇచ్చే రేషన్‌కి అదనంగా కేంద్రం ఇచ్చే కార్డుల బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రేషన్ షాపులను మూసేస్తామని చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా 7 లక్షల కార్డులు మంజూరు చేశామని గుర్తు చేశారు.

# ఫుడ్ పాయిజన్.. 30మంది విద్యార్థులకు అస్వస్థత

అమరావతి, జులై 26: జిల్లా పత్తికొండ మండలం చక్రాలలో ఫుడ్ పాయిజన్ అయ్యింది. మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గుడ్లు తిన్న అనంతరం 30మంది విద్యార్థుల అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పత్తికొండ ఆస్పత్రికి తరలించారు.

# త్వరలో సేంద్రియ మాల్స్.. సేంద్రియ కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం

అమరావతి, జులై 26: సేంద్రీయ కూరగాయలు మరియు పండ్లను ప్రజలకు, ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వినియోగదారులకు సులభంగా అందు బాటు లో ఉంచాలనే ఉద్దేశ్యంతో మార్కెటింగ్ శాఖ సరి కొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టబోతోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో వీటిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి అన్ని రకాల సేంద్రీయ ఉత్ప త్తులను అమ్మేలా ప్రత్యేక సేంద్రీయ మాల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో మొట్టమొదటి ఆర్గానిక్ మాల్‌ను విశాఖలోని ఎంవీపీ రైతు బజార్‌లో ఏర్పాటు చేయబోతున్నారు. దీనికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల నాటికి ఇది కార్యరూపం దాల్చనుంది. అదే సమయంలో విజయనగరం, శ్రీకాకుళంలో కూడా ఇలాంటి మాల్స్ ఏర్పాట్లకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 25 ప్రాంతాల్లో దశలవారీగా సేంద్రియ ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రత్యేక మాల్స్‌ను ఏర్పాటు- చేయాలనే లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ అడు గులు ముందుకు వేస్తోంది. విశాఖలో మొత్తం 101 యాక్టివ్ రైతు బజార్‌లు ఉన్నాయి, వాటిలో దాదాపు 25 రైతు బజార్లను ఆర్గా నిక్ మాల్స్‌గా మార్చడానికి అనుకూలమైనవని అది కారులు గుర్తించారు. వీటిలో సేంద్రియ కూర గాయలను విక్రయించేలా సేంద్రియ రైతులతో అక్కడి రైతు బజార్ల అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. తమ సేంద్రీయ ఉత్పత్తులను విక్రయించడానికి ఆసక్తి ఉన్నవారు ఒప్పందం కోసం మమ్మల్ని సంప్రదించవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే 9 మంది రైతులు తమ ఆర్గానిక్ ఉత్పత్తులను ఆయా రైతు బజార్లలో అమ్మేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. విశాఖ తర్వాత విజయవాడలో ఆర్గానిక్ మాల్ ఏర్పాటు కానుంది

# భద్రాచలం గోశాలలకు పశుగ్రాసాన్ని వితరణ చేసిన ఎమ్మెల్యే సండ్ర



ఖమ్మం, జులై 26: (నేటినిజం ప్రతినిధి): భారతీయ సంస్కృతిలో గోమాతను దేవతగా భావిస్తారని, అటువంటి గోమాతకు గోదావరి వరదల కారణంగా పశు గ్రాసం కొరతతో ఇబ్బంది పడుతున్నాయని తెలుపగా సత్తుపల్లి నియోజకవర్గంలోని మండలాల నుండి 50 ట్రాక్టర్లు ట్రక్కుల పశుగ్రాసాన్ని భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం గోశాలకు, గాయత్రీ గోక్షేత్రం గోశాలకు, అంబసత్రం గోశాలకు వితరణ చేయడం జరిగిందని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం నుండి 50 ట్రాక్టర్ ట్రక్కుల పశుగ్రాసంతో బయల్దేరి భద్రాచలం గోశాలకు వితరణ చేయడానికి తీసుకురాగా ఈ కార్యక్రమాన్ని భద్రాచలం వద్ద కలెక్టర్, ఖమ్మం జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ లతో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పశుగ్రాసాన్ని వితరణ చేశారు.

# నిపుణులైన విద్యార్థులు ఫార్మసీకి అవసరం

హైదరాబాద్, జులై 26: ప్రతి విద్యార్థి నైతిక విలువలు, క్రమ శిక్షణ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కె.నాగయ్య తెలిపారు. వెంకటాపూర్ - అనురాగ్ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో అనురాగ్ ఫార్మాకాన్ ట్రిప్స్-2022 ఆరో జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. నైపుణ్యం కలిగిన వ్యక్తులు ఫార్మసీ రంగానికి చాలా అవసరం ఉందని, నైపుణ్యతను పెంపొందించుకోవటం ద్వారా అవకాశాలు సులభతరం అవుతాయని చెప్పారు. ఈ సదస్సులో నిర్వహించిన ఓరల్, పోస్టర్ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఓరల్ ప్రదర్శనలో తమిళనాడులోని జేఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన బి.అపర్ణకు మొదటి బహుమతి, ఉస్మానియా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన జి.లక్ష్మికి ద్వితీయ బహుమతి, పి.రమ్యకు తృతీయ బహుమతి, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో మొదటి బహుమతి గుజరాత్‌కు చెందిన క్రీస్ట్ కాలేజ్ విద్యార్థిని ఎ.మోనాల్, ఓయూకు చెందిన జె.సౌమ్యకు ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి వరంగల్‌లోని జయముఖి కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన డి.హనీష్‌కు తృతీయ బహుమతులను అందజేశారు. ఫార్మసీ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను, అవకాశాలుగా మలుచుకోవాలని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. కో కన్వీనర్ డాక్టర్ శిరీష, కో ఆర్డినేటర్లు, వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కంటే తక్కువ అప్పులే చేశాం.. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అమరావతి, జులై 26: తెలుగుదేశం పార్టీ హయాంలో కంటే తక్కువ అప్పులే చేశామని ఏపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ? తమ ప్రభుత్వం ఎక్కువ అప్పులు చేయలేదన్నారు. ద్రవ్యలోటు ఏపీది ఎక్కువ ఏం కాదన్నారు. పరిమితికి మించి ఏపీ ఎక్కువ అప్పులు చేయలేదన్నారు. కోవిడ్ సంక్షోభం తర్వాత ప్రతి రాష్ట్రం అప్పులు చేసిందన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే ఏపీ చేసిన అప్పులు తక్కువేనన్నారు. ఎంతో నిబద్ధతతో తాము పాలన కొనసాగిస్తున్నామన్నారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ బాధ్యత లేకుండా వ్యవహరించిందన్నారు. 2019 తర్వాత చేసిన అప్పులు టీడీపీ చేసిన అప్పుల కంటే చాలా తక్కువ అన్నారు.

# ఆర్‌సీ పురంలో దారుణం.. హెడ్ కానిస్టేబుల్‌పై చైన్ స్నాచర్ కత్తితో దాడి

సంగారెడ్డి, జులై 26 (నేటినిజం ప్రతినిధి): రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్ దారుణానికి పాల్పడ్డాడు. అశోక్‌నగర్ హెచ్ఐజీ గేటు వద్ద ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగించేందుకు చైన్ స్నాచర్ యత్నించాడు. అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌వోటీ హెడ్ కానిస్టేబుల్ యాదయ్య.. స్నాచర్‌ను గమనించాడు.

అప్రమత్తమైన యాదయ్య.. చైన్ స్నాచర్‌ను పట్టుకునేందుకు యత్నించాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్‌పై స్నాచర్ కత్తితో దాడి చేసి పారిపోయాడు. యాదయ్యకు తీవ్ర రక్తస్రావం కావడంతో సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు. యాదయ్యను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి యాదయ్యను తరలించాలని సీపీ ఆదేశించారు.

# డిజిటల్ కేసుల దర్యాప్తులో..తెలంగాణ పోలీసులదే నాయకత్వం

హైదరాబాద్, జులై 26: డిజిటల్ కేసుల పరిష్కారానికి తెలంగాణ పోలీసులే నాయకత్వం వహిస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. టీఎస్ పీఏ(తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ)లో డార్క్ వెబ్ ఇన్విస్టిగేషన్‌పై ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను సీవీ ఆనంద్ సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌నకు దేశ నలుమూలల నుంచి పలువురు పోలీసు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు, నిఘా ఏజెన్సీల ప్రతినిధులు హాజరయ్యారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు డార్క్‌వెబ్, హ్యాకింగ్, క్రిప్టో కరెన్సీ నేరాలకు అధునాతన పద్ధతుల్లో పాల్పడుతున్నారు. సైబర్ నేరాలను పరిశోధించడం, నిందితులను పట్టుకోవడానికి దర్యాప్తు సంస్థలకు డిజిటల్ భూ భాగంలో ఇన్నో ఇబ్బందులు ఉన్నాయి.

ఇలాంటి ఆందోళనకరమైన పరిస్థితులను ఎదుర్కోవడంలో భాగంగా తెలంగాణ ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్, యూకే పోలీస్ విభాగంలో 40 ఏండ్లు పనిచేసిన మాజీ పోలీసు అధికారి మార్క్ బెంట్లీ భాగస్వామిగా ఉన్న ఇన్నోవేషన్ ల్యాబ్స్‌తో కలిసి ఈ శిక్షణను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, 15 రకాల సైబర్ మోసాలు ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందులో ప్రధానంగా రుణ యాప్‌ల వేధింపులతో 10 రోజుల్లోనే ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఇందుకు కారకులైన నేరగాళ్లను పట్టుకోవడం కష్టంగా మారుతున్నదని అన్నారు. వేధింపులకు పాల్పడే నేరగాళ్లలో కొందరు ఇతర దేశాలకు చెందిన వారు కూడా ఉంటున్నారని తెలిపారు. ఇటీవల మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ సర్వర్ హ్యాకింగ్, ఎక్సిలికా పేమెంట్ గేట్‌వే హ్యాకింగ్ కేసులను ఛేదించామన్నారు. ఇలాంటి కేసులు దర్యాప్తు చేయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారితో తగిన వనరులు కూడా అవసరమన్నారు. ప్రస్తుతం పలు అంశాలపై ఐదు రోజుల వర్క్‌షాప్‌లో నిపుణులు శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు.

# వినాయక నిమజ్జనానికి మరో 50 కోనేరులు

హైదరాబాద్, జులై 26: హుస్సేన్‌సాగర్, ఇతర చెరువుల్లో పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో చేసిన రంగు విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. 30 సర్కిళ్ల పరిధిలో ప్రస్తుతం ఉన్న 28 కోనేరుల (బేబీ పాండ్స్)తో పాటు అదనంగా మరో 50 ప్రాంతాల్లో తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకు(బేబీ పాండ్స్)ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. జోన్‌కు ఎనిమిది చొప్పున ఆరు జోన్లలో 48 ఏర్పాటుతో పాటు, అవసరమైతే అదనంగా మరో రెండు చోట్ల ఏర్పాటు చేసేందుకు గానూ రిక్వెస్ట్ ఫర్ కొటేషన్స్ (ఆర్ఎఫ్‌పీ) పేరిట టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ) విగ్రహాల నిమజ్జనంతో జలవనరులు కాలుష్యం అవుతున్నాయని పలు స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు గతంలో కోర్టును ఆశ్రయించగా, దీనిపై స్పందించిన హైకోర్టు హుస్సేన్‌సాగర్‌తో పాటు పలు చెరువుల్లో పీవోపీ విగ్రహాల నిమజ్జనం వద్దని ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే.

దీంతో ఈ ఏడాది అదనంగా మరో 50 ప్రాంతాల్లో మినీ నిమజ్జనం కొలనుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. అయితే, హుస్సేన్‌సాగర్‌పై ఒత్తిడి తగ్గించేందుకు నగరంలో ఇప్పటికే 28 చోట్ల మినీ నిమజ్జన కొలనులను నాలుగేండ్ల కిందట జీహెచ్ఎంసీ నిర్మించింది. మూడు నుంచి ఐదు అడుగులు, అంతకంటే తక్కువ ఎత్తున్న విగ్రహాలను ఈ కొలనుల్లో నిమజ్జనం చేస్తున్నారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేసే ట్యాంకుల నిర్మాణ విషయానికొస్తే 20 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 1.32 మీటర్ల లోతులో ట్యాంకులు నిర్మించనున్నారు. పీవీపీ మెటీరియల్‌తో తయారు చేసే ట్యాంకుల ఏర్పాటు నుంచి నిమజ్జనం అనంతరం వాటి తొలగింపు వరకు సంబంధిత ఏజెన్సీలదే బాధ్యత ఉంటుంది. ప్రతి కొలను వద్ద ఆరుగురు కార్మికులను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. ఈ కొలనులో 10 అడుగుల (మూడు మీటర్లకు మించని) ఎత్తున్న మట్టి విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేయనున్నారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా ఖైరతాబాద్ వినాయకుడు మట్టితో రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే.

# టాటా షోరూమ్‌లో రూ.10 లక్షలు చోరీ

హైదరాబాద్, జులై 26: బోయిన్‌పల్లి టాటా కార్ షోరూమ్‌లో భారీ చోరీ జరిగింది. ఈ షోరూమ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో పాటు భద్రతకు ఒకేఒక సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకున్నారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. బోయిన్‌పల్లిలోని మాలిక్ టాటా కార్ షోరూమ్ నిర్వహణ బాధ్యతలను ఏజీఎం రంజిత్ కుమార్ చూస్తున్నారు. శనివారం రాత్రి క్యాషియర్ శ్రీనివాస్ షోరూమ్ మొదటి అంతస్తులో ఉన్న క్యాష్ కౌంటర్‌లోని లాకర్‌లో రూ. 10 లక్షలు పెట్టి, తిరిగి లాక్ చేసి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఆదివారం, బోనాలు ఉండటంతో సాయంత్రం 6 గంటలకే షోరూమ్ మూసివేసి అందరూ వెళ్లిపోయారు. సోమవారం ఉదయం షోరూమ్‌కు వచ్చిన హౌస్ కీపింగ్ వర్కర్లు పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. క్యాషియర్ శ్రీనివాస్ కూడా వచ్చాడు.

సిబ్బందితో క్యాష్ కౌంటర్‌ను శుభ్రం చేయించేందుకు అతడు మొదటి అంతస్తుకు వెళ్లాడు. క్యాష్ కౌంటర్, క్యాబిన్ తీసి ఉండటంతో పాటు లాకర్ తెరిచి ఉంది. లాకర్‌లో దాచిన రూ. 10 లక్షలు కూడా కనిపించలేదు. కంగుతిన్న క్యాషియర్ శ్రీనివాస్ చోరీ జరిగినట్టు గ్రహించి, లోనికి ఎవరినీ అనుమతించలేదు. విషయాన్ని ఏజీఎం రంజిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాడు. హుటాహుటిన షోరూమ్‌కు వచ్చిన రంజిత్ కుమార్ వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీమ్ సందర్శించింది.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా షోరూమ్‌ను బోయిన్‌పల్లి సీఐ రవికుమార్‌తో కలిసి బేగంపేట ఏసీపీ పృథ్వీధర్ రావు, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించి, షోరూమ్ నిర్వాహకులను ప్రశ్నించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ బోయిన్‌పల్లి పోలీసులు గతంలో పలుమార్లు షోరూమ్‌కు నోటీసులు కూడా ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇదే క్రమంలో పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. వారిచ్చిన సమాచారంతోనే కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తొర్రురులో ఎలుగుబంటి సంచారం-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్, జులై 26 (నేటినిజం ప్రతినిధి): తొర్రురు మున్సిపాలిటీ:స్థానిక 7వ వార్డులో నిన్న రాత్రి ఎలుగుబంటి సంచరించినట్లు స్థానికులు తెలిపారు సంబంధిత అధికారుల కు ఫోన్ చేసి చెప్పడంతో ఈరోజు తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగలపల్లి రామచంద్రయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మంగిలాల్ తో వార్డు లో పర్యటించి స్థానికులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు ఎలుగుబంటి సంచరించిన అడుగులు గుర్తించారు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరు కూడా రాత్రి వేళల్లో బయటకు రావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుండె బాబు,వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి,మాదుగుల పూలమ్మ నట్వర్,మన్నెం రాములు,మాలిక్ స్థానికులు పాల్గొన్నారు×



# సీజనల్ వ్యాధులు సోకకుండా విస్తృత స్థాయిలో ముందస్తు చర్యలు ... !

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ .



సంగారెడ్డి , జూలై 25 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో ఎక్కడ కూడా డెంగ్యూ, మలేరియా, అతిసారం, విషజ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు సోకకుండా విస్తృత స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాల వట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు రక్షిత మంచినీటి సరఫరా జరిగేలా, నాణ్యమైన భోజనం అందేలా ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని సూచించారు. వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే ఈగలు, దోమలు, బొద్దింకలు, పురుగుల నివారణ కోసం అందుబాటులో ఉన్న అన్ని ఆధునిక పద్ధతులను అవలంభించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాల్లో ముందస్తు చర్యలు చేపట్టడం, బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ లక్ష్య సాధన తదితర అంశాల పై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సంబంధిత శాఖల మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ లతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంత్రుల దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీల వారీగా ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ ఏ ఎన్ ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులతో కూడిన బృందాలతో ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, విద్యాసంస్థల్లో వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం లేకుండా సాధారణ పరిస్థితి కొనసాగేలా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పాఠశాల వారీగా, నివాస ప్రాంతం వారీగా శానిటేషన్ పనులను అనునిత్యం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి పైప్ లైన్ లకు ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలని, ప్రతి ట్యాంకును శుభ్రం చేయిస్తూ క్లోరినేషన్ జరిగేలా చూడాలన్నారు. ఎక్కడ కూడా మురుగు నీరు, వర్షపు జలాలు నిలువ ఉండకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ తదితర చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. తలుపులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, కిటికీలకు దోమలు లోనికి ప్రవేశించకుండా జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాడైపోయిన బియ్యం, ఇతర వస్తువులను వినియోగించకూడదని, పాడైన బియ్యం స్థానంలో నాణ్యమైన బియ్యం అందించాల్సిందిగా పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎవరికైనా నిధుల సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఏ ఒక్క చోట కూడా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఏ.ఎన్.ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దోమతెర వినియోగించేలా చూడాలన్నారు. రేపటి నుండే ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతంలో పరిసరాలను పరిశీలిస్తూ, ఎక్కడైనా సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ ఇంటింటికి స్టిక్కర్లు అతికించాలని సూచించారు. హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంటే ముందుగా నోటీసులు జారీ చేయాలనీ, అప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోతే పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని అన్నారు. గ్రామాల్లో నివాస ప్రాంతాల సమీపంలో పెంటకుప్పలు తొలగించేందుకు చొరవ చూపాలని, అవసరమైతే కఠిన నిర్ణయాలతో ముందుకెళ్లాలని అన్నారు. కాగా, పన్నెండు సంవత్సరాలు, అంతకు పైబడిన వయస్సు కలిగిన వారందరు తప్పనిసరిగా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకునేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, అన్ని కళాశాలల్లో రేపటి నుండే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజశ్రీ షా , జెడ్పి ఎల్లయ్య , డీపీవో , డీ ఎం హెచ్ ఓ డాక్టర్ గాయిత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : వీడియో కాన్ఫరెన్సులో మంత్రులు

భారీ వర్షాలు, వరదల కారణంగా డెంగ్యూ,మలేరియా, అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికన అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావు అధికారులను ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్ బి ఆర్ కే భవన్ నుండి సీజనల్ వ్యాధుల నియంత్రణ, రెసిడెన్షియల్ పాఠశాలలు, బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ అంశాల పై సంబంధిత శాఖల మంత్రులు, సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయని, ఇప్పటి వరకు 1610 డెంగ్యూ కేసులు వచ్చాయని మంత్రి తెలిపారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి డెంగ్యూ కేసుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత సంవత్సరం ఇప్పటివరకు 260 మలేరియా కేసులు, 1610 డెంగ్యూ కేసులు, 42 చికెన్ గునియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రతి శుక్రవారం గ్రామా స్థాయిలో, ఆదివారం రోజున పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయాలని మంత్రి హరీష్ రావు కలెక్టర్లకు సూచించారు. డెంగ్యూ, మలేరియా కేసులను ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స చేయడానికి అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, మందులు, బ్లడ్ ప్లేట్ లెట్స్ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రచారం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందే విధంగా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే వినియోగించాలని, పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, ప్రతివారం రెసిడెన్షియల్ పాఠశాలలో ఫాగింగ్ చేపట్టాలని, కిచెన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.77 కోట్ల మంది ప్రజలకు బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ అందించాలని, ఇప్పటి వరకు 20 లక్షల మంది ప్రజలకు బూస్టర్ డోస్ వేసామని మంత్రి తెలిపారు. 26 ఆగస్టు,2022 నాటికి ప్రతి విద్యా సంస్థలో ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించి 12 నుంచి 17 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు 100% వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ కోసం ప్రజాసంచారం అధికంగా ఉండే బస్టాండ్లు, రైల్వే స్టేషన్ మార్కెట్లలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్రామాలు మున్సిపాలిటీలో ఇంటింటా సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ వేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలతో విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థులకు వ్యాక్సిన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, గ్రామాలలో మురికి కాలువలనుశుభ్రం చేయించాలని, మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయాలని, పైప్ లైన్ లీకేజీలను అరికట్టాలని సూచించారు. గ్రామాలలో ప్రజలు కాచిన నీళ్లు తాగేవిధంగా అవగాహన కార్యక్రమాలు చేవట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. పంచాయత్ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సిజనల్ వ్యాధులు ప్రబలకుండా సమన్వయంతో చేయాలన్నారు.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వంద శాతం వ్యాక్సినేషన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలను జిల్లా విద్యాశాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారులు వారానికి ఒకసారి తనిఖీ చేయాలని, వసతి గృహాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత పరిశీలించాలని అన్నారు.

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని,తరచూ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని, వసతి గృహాలు, పరిసరాలలో పరిశుభ్రత పాటించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో ఉన్న పాత బియ్యం స్టాక్ స్థానంలో నూతనంగా బియ్యం సరఫరా చేస్తున్నామని, వాటి ని వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రం నుంచి బియ్యం కొనుగోలుకు అంగీకరించినందున రైస్ మిల్లులు త్వరితగతిన ప్రారంభించి సకాలంలో బియ్యం సరఫరా జరిగే విధంగా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు.

రాష్ట్ర మహిళా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ప్రతి గిరిజన పాఠశాలకు ఒక అధికారికి బాధ్యత అప్పగించి ప్రతివారం ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాల పరిసరాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతి మాసం వైద్యులు వచ్చి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైస్ మిల్లుల త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు 2 షిఫ్టులలో కస్టం మిల్లింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సివిస్ సూచించారు.

# విశాఖలో క్యాంప్ ఆఫీస్! వచ్చే నెలలోనే శ్రీకారం

అమరావతి, జులై 26: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన రాజకీయ చతురతకు పదును పెడుతున్నా రు. గడచిన రెండు, మూడు మాసాలుగా ఆయన తీసుకుంటు న్న నిర్ణయాలు, మాట్లాడుతున్న మాటలు ఆయన పాలనలో వేగం పెంచుతున్నారనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్లీనరీ భారీ సక్సెస్ కావడంతో రెట్టించిన ఉత్సాహంతో ఉన్న సీఎం జగన్ ఇప్పుడు విశాఖపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. అందులో భాగంగా ఆగస్టు మాసంలో విశాఖ లో తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించాలని వడివడిగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆషాడ మాసం కావడంతో ఈ కార్యక్రమాన్ని ఆగస్టు మాసంలో పూర్తిచేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆమేరకు విశాఖలో క్యాంపు కార్యాలయ ఏర్పాట్లు ఊపందుకున్నా యని తెలుస్తోంది. మూడు రాజధానులపై కోర్టు కేసు ఉన్నందున రాజధానిని తరలించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఆయన తన క్యాంపు కార్యాలయాన్ని అక్కడ ఏర్పాటు చేయడం ద్వారా ప్రతిపక్షాలకు తన మార్క్ రాజకీయం చూపించే అవకాశం ఉందని సీఎం జగన్ భావనగా చెబుతున్నారు.

ఇదిలా ఉండగా మూడు రాజధానుల అంశం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలోనే కోర్టు తీర్పును గౌరవిస్తూనే ఆయన తన కార్యాచరణ రూపొందించుకుం ట న్నారు. వ్యవస్థలను అక్కడకు తీసుకెళ్లకుండా ఆయన తన క్యాంపు కార్యాలయాన్ని మాత్రమే అక్కడకు తీసుకువెళ్లి వారంలో మూడు రోజులపాటు అక్కడ నుండి అన్ని అంశాలను చక్కబెట్టనున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యా లయంలో కూర్చొనే సమయాన్నే విశాఖలోని తన క్యాంపు కార్యా లయంలో కూర్చొని పరిపాలన సాగించనున్నారు. ఇలా చేయడం వల్ల కోర్టు తీర్పును గౌరవించడంతోపాటు తాను అనుకున్నది కూడా నెరవేరుతుందని సీఎం అభిమతంగా పార్టీ వర్గాలు పేర్కొం టు న్నాయి. ఇప్పటికే సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాట్లు విశాఖలో తుది దశకు చేరుకున్నట్లుగా తెలుస్తోంది.

ఇకపై వారంలో మూడు రోజులపాటు అక్కడే ఉండేలా సీఎం జగన్ ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆమేరకు అవసరమైన అధికారులను మాత్రమే అక్కడకు తరలించనున్నారు. మిగిలిన అధి కారులు అవసరమైతే అక్కడకు పిలిపించుకునే అవకాశం ఉందని ఓ సీనియర్ అధికారి చెప్పారు. కేవ లం క్యాంపు కార్యా లయం మాత్రమే విశాఖకు వెళ్లే అవకాశ ముందని, ఇతర కార్యాల యాలన్నీ అమరావతి నుండే పరిపాలన కొనసాగిస్తాయని పార్టీ సీనియర్ నేత కూడా ఒకరు తన అభిప్రాయన్ని వెల్లడించారు. ఎక్కువ శాతం అధికారులు ఇక్కడే ఉండటం వల్ల మొదటి నాలుగు రోజులపాటు అమరావతిలో సీఎం జగన్ ఉండేలా కార్యాచరణ సి ద్ధం చేశారు. అయితే, చివరి రెండు రోజు లు సెలవు దినాలు కా వడంతో కేవలం సమీక్ష నిర్వ హించే శాఖ అధికారులు మాత్రమే ఆ రెండు రోజుల్లో అందుబాటులో ఉండేలా చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై ఆలోచన చేస్తున్నారు. అది సాధ్యపడ కపోతే మూడు రోజులు అక్కడి నుండి ప్రభుత్వ పరమైన అంశాలపై దృష్టిసారించి మిగిలిన నాలుగు రోజులు మాత్రం అటు ప్రభుత్వం ఇటు పార్టీ పరమైన అంశా లపై సీఎం జగన్ దృష్టిపెట్టే అవకాశాలను కూడా పరిశీ లిస్తున్నారు.

ఉన్నట్టుండి సీఎం జగన్ ఈనిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయ ఎత్తుగడే ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎటుగూడి రాయలసీమ జిల్లాల్లో సీఎం జగన్‌కు తిరుగులేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన మేరకు ఈసారి కూడా సీట్లు వచ్చే అవకాశముందని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రలో కూడా అదే పరిస్థితి కల్పిస్తే ప్రతిపక్షాలకు ధీటైన జవాబు చెప్పొచ్చనేది ఇప్పు డు చర్చనీయాంశంగా మారింది. ఇది రాజకీయంగా పార్టీకి మంచి మైలేజీ తీసుకొస్తుందని పార్టీ పెద్దలు కూడా అంగీకరిస్తున్నారు. ఇక రెండో అంశంగా విశాఖ నుండి పరిపాలన సాగిస్తామని సీఎం జగన్ ఏడాదిన్నర క్రితమే చెప్పారు. ఈ క్యాంపు కార్యాలయాన్ని అక్కడ ఏర్పాటుచేసి వారంలో మూడు రోజుల పాటు అక్కడి నుండే పాలన సాగించడం ద్వారా ఆయన తన మూడు రాజధానుల అంశం హామిని కూడా నిలబెట్టుకున్నట్లవుతుందని భావిస్తున్నట్లు సమాచారం.

# జిల్లాలోని చెరువు కట్టలు తెగకుండా ముందుస్తు జాగ్రత్తలు పాటించాలి.

## -సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. శరత్

సంగారెడ్డి , జూలై 26 (నేటి నిజం ప్రతినిధి) మంగళవారం జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో వర్షాలు ఆగకుండా కురుస్తుండటంతో చెరువులకు గండ్లు పాడటానికి అవకాశం ఉన్నందున ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని అన్నారు. జిల్లాలో డెంగ్యు, మలేరియా ,అతిసారం, విషజ్వరాలు వంటి సిజనల్ వ్యాదులు సోకకుండా విస్తృత స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా. శరత్ ఆదేశించారు. ఎక్కడ కూడా మురుగు నీరు, వర్షపు నీరు నిలవకుండా ఒక్కో పాటశాల వారీగా, నివాస ప్రాంతం వారీగా శానిటేషన్ పనులను అనునిత్యం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. దోమల వ్యాప్తిని నిరోదించేందుకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ తదితర చర్యలు చేపట్టాలని అన్నారు. ఎట్టి పరిస్థితులలో జిల్లాలో ఏ ఒక్కరికి కూడా సిజనల్ వ్యాదులు ప్రబలకుండా సంబందిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలనీ సూచిం చారు. గ్రామాల్లో నివాస ప్రాంతాల సమీ పంలో పెంట కుప్పలు తొలగించేందుకు చొరవ చూపాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కల్లెక్టర్లు రాజషి షా, వీర రెడ్డి , ఆర్.డి.ఓ లు,ఇరిగేషన్ అధికారులు, రహదారులు భావనల శాఖ అధికారులు, తహసిల్దారులు, ఎం.పి.డి.ఓ లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# నిర్వాసితుల ఇళ్లను కూల్చేందుకు యత్నం-వాటర్ ట్యాంక్ ఎక్కిన బాధితులు



రంగారెడ్డి, జులై 26: : సింగరేణి భూ నిర్వాసిత గ్రామమైన లద్నాపూర్ బాధితుల ఇళ్లను కూల్చివేసేందుకు అధికారులు యత్నించడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. గత కొన్ని రోజులుగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయమై నిర్వాసితులు, సింగరేణి మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఆర్జీ3 జీఎం మనోహర్ నేతృత్వంలో మంథని సీఐ సతీష్, రామగిరి ఎస్ఐ రవిప్రసాద్, పోలీస్ బందోబస్తు మధ్య 4 షావెల్స్, ఒక డోజర్, జేసీబీలతో నిర్వాసితుల ఇళ్లను కూల్చివేసే ప్రయత్నం చేశారు.

పనులకు అడ్డు వస్తున్నారన్న కారణంగా సర్పంచ్ బడికెల విజయ శ్రీనివాస్, ఎంపీటీసీ ఉమా రాజయ్య, మాజీ ఎంపీటీసీ వనం రాంచందర్‌రావు, వార్డుసభ్యులు గెల్లు భార్గవ్, నూనె మల్లేశ్‌లను అక్రమంగా అరెస్టు చేసి గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు బాధితులు తెలిపారు. చర్యను నిరసిస్తూ కొందరు భూ నిర్వాసితులు వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేసి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తరలించారు. కాగా, తమను అదనపు కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు అనుమతి కల్పించాలని నిర్వాసితులు కోరినట్లు సీఐ సతీష్ తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితో పెద్దపల్లికి తరలించినట్లు వివరించారు.

# బాలుడిని ఎత్తుకున్న జగన్- సీఎం జేబులో పెన్ లాగిన చిన్నారి

అమరావతి, జులై 26: సీఎం జగన్ ఉభయగోదావరి జిల్లాల్లో వరద ప్రభావి ప్రాంతాల పర్యటనకి వెళ్లారు.ఈ మేరకు సీఎం వరద బాధితులతో స్వయంగా మాటలాడారు. ప్రస్తుతం కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల పరిధిలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ట్రాక్టర్‌పై ముందుకు సాగుతున్న జగన్? వరద బాధితుల కష్టాలను స్వయంగా ఆలకిస్తున్నారు. ఈ సందర్భంగా తన వద్దకు ఓ వినతి పత్రం చేతబట్టుకుని 8 నెలల బాలుడితో వచ్చిన ఓ మహిళ నుంచి వినతి పత్రాన్ని స్వీకరించిన జగన్? ఆమె చేతిలోని బాలుడిని తన చేతుల్లోకి తీసుకున్నారు. కాగా జగన్ జేబులోని పెన్‌ను ఆ బాలుడు తీసుకునేందుకు ప్రయత్నించాడు. కాసేపటికి ఆ బాలుడిని తల్లికి అందజేశారు జగన్. ఈ సందర్భంగా బాలుడు జగన్ వైపు చూడగా? తన జేబులోని పెన్‌ను తీసిన జగన్? దానిని బాలుడికి అందించారు. ఈ మొత్తం దృశ్యాలతో కూడిన వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# వరద బాధితులకు ప్రభుత్వ చేయూత..



కరీంనగర్ , జులై 26: భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎలిగేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని 53 మందికి ఒక్కొక్కరికి రూ. 3200 చొప్పున రూ. 1 లక్షా 69 వేల 600 ఆర్థిక సహాయం ఎమ్మెల్యే అందజెశారు. అనంతరం ఐకేపీ సీఏలు, మహిళా సంఘాల సభ్యులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలతో ఇల్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

తక్షణ సహాయంగా ఆర్థిక సాయం చేసిందన్నారు. అలాగే గ్రామాల్లో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసేలా ప్రజలకు మహిళా సంఘాలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక రాజనర్సు, మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ విజయ భాస్కర్ రెడ్డి, గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, తెరాస ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని కలిసిన జిల్లా అధికారులు



ఖమ్మం, జులై 26 (నేటినిజం ప్రతినిధి) :జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్ధసారధి ని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు మొగిలి స్నేహలత, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిలు ఎన్ ఎస్ పి అతిధి గృహంలో మర్యాదపూర్వకంగా కలసి మొక్కలు అందజేశారు.

# ఖమ్మం జిల్లాలో మొదటి మంకీ ఫాక్స్ లక్షణాలు ఉన్న వ్యక్తి గుర్తింపు

ఖమ్మం, జులై 26: (నేటినిజం ప్రతినిధి): ఉత్తరప్రదేశ్ కి చెందిన సందీప్ అనే వ్యక్తి ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు.

వెంటనే హైదరాబాద్ కి తరలించాలని వైద్యులను ఆదేశించిన డి.యం - హెచ్ ఓ

# ముగ్గురు మావోయిస్టు సానుభూతిపరుల అరెస్టు



ములుగు , జులై 26 (నేటినిజం ప్రతినిధి): ముగ్గురు మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం నూగూరు సీఐ శివప్రసాద్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని వెంకటాపురం నూగూరు మండలం కొండపురం గ్రామ శివారులో బ్రిడ్జి వద్దపోలీసులు వాహనాలు తనికీ చేస్తుండగా.. ముగ్గురు మావోయిస్టు సానుభూతిపరులు పట్టుబడ్డారని తెలిపారు.

కొండపురం గ్రామానికి చెందిన తాటి సోమయ్య, తాటి సత్యం, యాలం సురేష్ మావోయిస్టు అగ్ర నాయకుల ప్రసంగాలకు ఆకర్షితులై గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీకి సానుభూతిపరులుగా వ్యవహరిస్తూ.. వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు వివరాలను వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# ఆకలి తీర్చుతున్న అన్నపూర్ణ- రూ.5కే కమ్మటి భోజనం

హైదరాబాద్, జులై 26: హైదరాబాద్ మహా నగరంలో అన్నపూర్ణ కేంద్రాలు పేదల పాలిట 'అక్షయ పాత్ర'గా మారాయి. ఆపత్కాలంలో పేదలు పస్తులుండకుండా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ల ఆదేశాల మేరకు గ్రేటర్‌లో 373 కేంద్రాల్లో రోజుకు దాదాపుగా 80 వేల మందికి రెండు పూటలా ఉచిత భోజనాలు అందిస్తూ ఉన్నారు. రుచి, శుచి సమతుల పోషకాలతో ఆహారాన్ని అందిస్తుండటంతో వలస కార్మికులు, విద్యార్థులు, బ్యాచిలర్లు, చిరుద్యోగులు కడుపు నింపుకుంటున్నారు. 2014వ సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ చొరవ తీసుకుని ప్రవేశపెట్టిన అన్నపూర్ణ భోజనం పథకాన్ని ప్రభుత్వం రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తూ పటిష్టంగా అమలు చేస్తున్నది. అన్నపూర్ణ పథకంతో 2014 నుంచి మే నెలాఖరు వరకు 9,67,53,612 భోజనాలను వడ్డించినట్టు అధికారులు తెలిపారు. ఇందుకు గాను రూ.185 కోట్ల 89 లక్షలను ఖర్చు చేసినట్లు చెప్పారు.

విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో దాదాపు ఒక కోటి జనాభా నివసిస్తున్నది. ఆర్థిక స్థితి, నైపుణ్యంతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల ప్రజలను హైదరాబాద్ నగరం అకున చేర్చుకుంటున్నది. దేశంలో విద్యా, నైపుణ్య శిక్షణ, ఉపాధికి హైదరాబాద్ నగరం గమ్య స్థానంగా మారింది. ఈ నేపథ్యంలోనే నగరానికి వచ్చిన ప్రతి ఒకరి బతుకుకు భరోసా కల్పిస్తున్నది. నగరంలో రోజువారీగా వివిధ వృత్తులపై మనుగడ సాగిస్తున్న పేదలు, నైపుణ్యాభివృద్ధి ఉపాధికి శిక్షణ పొందుతూ వేలాది మంది యువత పోటీ పడుతున్నారు. అటు పేదలు, ఇటు ఉద్యోగార్థుల ఆకలిని తీర్చేందుకు అన్నపూర్ణ భోజన పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నది. లబ్ధిదారులు నుంచి కేవలం రూ.5/- లకే 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల సాంబారు, 100 గ్రాముల పప్పుతో పాటు 15 గ్రాముల పచ్చడితో కూడిన నాణ్యమైన పోషక విలువలున్న భోజనాన్ని అన్నపూర్ణ పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్నది.కొవిడ్ విపత్తుకు ముందు 150 కేంద్రాలు ద్వారా రోజుకు 45 వేల అన్నపూర్ణ భోజనాలను అందించారు. మొదటి విడత కొవిడ్ లాక్ డౌన్ సమయంలో హైదరాబాద్ నగరంలో మధ్యాహ్నం పూట 373 రెగ్యులర్, మొబైల్ కేంద్రాల ద్వారా పూర్తిగా అన్నపూర్ణ భోజనం ఉచితంగా పెట్టారు. 259 రెగ్యులర్, మొబైల్ కేంద్రాల ద్వారా రాత్రి పూట భోజనం పెట్టినట్టు అధికారులు తెలిపారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్ లాంటి విపత్తులో నిరుపేదల ఆకలి బాధను తీర్చేందుకు అన్నపూర్ణ పథకం అక్షయ పాత్రగా మారిందన్నారు. 2020-21లో 2 కోట్ల 29 లక్షలు 46 వేల 80 భోజనాలతో అన్నార్థుల ఆకలిని తీర్చినదని పేర్కొన్నారు. లబ్ధిదారులు సౌకర్యంగా భోజనం చేయుటకు అన్నపూర్ణ కేంద్రాలకు సీటింగ్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మొదటగా నగరంలో సీటింగ్

# దాతలు మనఊరు -మనబడికి సహకరించాలి : మంత్రి మల్లారెడ్డి



హైదరాబాద్, జులై 26:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా ఆధునీకరించడానికి సీఎం కేసీఆర్ రూ. 7,200 కోట్లను కేటాయించారు. మనఊరు -మనబడికి దాతలు సహకరించాలని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు.

మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు బొక్క సురేందర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి స్థాపించిన అక్షయ పౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పర్చేందుకు దుష్టిపెట్టారని అన్నారు. అన్ని ప్రాంతాలలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను ఆధుకరించేందుకు తగిన నిధులు కేటాయించారని పేర్కొన్నారు.

విద్యలో ప్రపంచ స్థాయిలో పోటే పడేందుకు పాఠశాలల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నడుం బిగించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.పావని, కౌన్సిర్లు పాల్గొన్నారు.

# జులై 28వ, 29వ తేదీలలో గుజరాత్‌ను మరియు తమిళ నాడు నుసందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 26: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022వ సంవత్సరం జులై 28వ, 29వ తేదీల లో గుజరాత్ ను మరియు తమిళ నాడు ను సందర్శించనున్నారు. జులై 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వేళ లో సాబర్ కాంఠా లోని గఢోడా చౌకీ ప్రాంతం లో సాబర్ డెయరి కి చెందిన అనేక ప్రాజెక్టుల ను ప్రధాన మంత్రి ప్రారంభించడమే కాకుండా మరికొన్ని పథకాల కు శంకుస్థాపన ను కూడా చేయనున్నారు. అటు తరువాత ప్రధాన మంత్రి చెన్నై కు పోయి సాయంత్రం సుమారు 6 గంటల వేళ కు చెన్నై లోని జెఎల్ఎన్ ఇండోర్ స్టేడియమ్ లో 44వ చెస్ ఒలింపియాడ్ ప్రారంభం అయినట్లు గా ప్రకటిస్తారు.

జులై 29వ తేదీ న ఉదయం ఇంచుమించు 10 గంటల వేళ కు, ప్రధాన మంత్రి అన్నా యూనివర్సిటీ యొక్క 42వ స్నాతకోత్సవంలో పాలుపంచుకొంటారు. ఆ తరువాత ఆయన గాంధీనగర్ కు ప్రయాణమవుతారు. గాంధీనగర్ లోని జిఐఎఫ్ టి సిటీ ('గిఫ్ట్ సిటీ') లో ఇంచుమించు సాయంత్రం 4 గంటల వేళ కు ఆయన వివిధ ప్రాజెక్టుల ను ప్రారంభించడం తో పాటుగా మరికొన్ని ప్రాజెక్టుల కు శంకుస్థాపన కూడా చేస్తారు.

గుజరాత్ లో ప్రధాన మంత్రి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కు ఊతాన్ని అందించడం తో పాటు గా వ్యవసాయాన్ని మరియు సంబంధిత కార్యకలాపాల ను మరింత ఫలప్రదం గా తీర్చిదిద్దడం పట్ల ప్రభుత్వం శ్రద్ధ ను తీసుకొంటూ వస్తున్నది. ఈ దిశ లో వేసిన మరొక అడుగా అన్నట్లు, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సాబర్ డెయరి ని సందర్శించి 1,000 కోట్ల రూపాయల పై చిలుకు విలువ కలిగిన అనేక ప్రాజెక్టుల ను ప్రారంభించడం/ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు లు స్థానిక రైతుల, పాల ఉత్పత్తిదారుల సశక్తీకరణ తో పాటు వారి ఆదాయం వృద్ధి చెందేందుకు తోడ్పడనున్నాయి. ఇది ఆ ప్రాంతం లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కు ఒక ఉత్తేజాన్ని కూడా అందిస్తుంది.

సాబర్ డెయరి లో దాదాపుగా రోజుకు 120 మిలియన్ టన్నుల (ఎమ్ టిపిడి) సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక పౌడర్ ప్లాంటు ను ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం 300 కోట్ల రూపాయల కు పైనే ఉంటుంది. ఈ ప్లాంటు యొక్క లే అవుట్ ప్రపంచ ఆహార భద్రత ప్రమాణాల కు తుల తూగుతుంది. ఇది దాదాపు గా సున్నా స్థాయి ఉద్గారం తో కూడి ఉండి, శక్తి ని చాలావరకు ఆదా చేస్తుంది కూడాను. ఈ ప్లాంటు లో అత్యధునాతనమైనటువంటి మరియు పూర్తి గా యంత్రాల పై ఆధారపడి పని చేసేటటువంటి బల్క్ ప్యాకింగ్ లైను ను సమకూర్చడం జరిగింది.

సాబర్ డెయరి లో అసెప్ టిక్ మిల్క్ ప్యాకేజింగ్ ప్లాంటు ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ఒక రోజు లో 3 లక్షల లీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉన్నటువంటి ఈ ప్లాంటు అతి ఆధునికమైనటువంటి ప్లాంటు అని చెప్పాలి. దాదాపు గా 125 కోట్ల రూపాయల మొత్తం వ్యయం తో ఈ ప్రాజెక్టు ను రూపుదిద్దడమైంది. ఈ ప్లాంటు లో శక్తి ని అధిక స్థాయి లో ఆదా చేసేటటువంటి మరియు పర్యావరణ హితకరమైనటువంటి సాంకేతిక పరిజ్ఞానం జతపడ్డ అతి ఆధునికమైన ఆటోమేశన్ సిస్టమ్ ఉంది. పాల ఉత్పత్తిదారుల కు మెరుగైన ప్రతిఫలం అందేటట్లు చూడటం లో ఈ ప్రాజెక్టు సహాయకారి కానుంది.

సాబర్ జున్ను మరియు పాల విరుగుడు తేట ను ఎండబెట్టే ప్లాంటు ప్రాజెక్టు నిర్మాణాని కి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు యొక్క అంచనా వ్యయం దాదాపు గా 600 కోట్ల రూపాయలు. ఈ ప్లాంటు చెద్దర్ చీజ్ (దీని సామర్థ్యం రోజు కు 20 మిలియన్ టన్ను లు), మొజారెల్లా చీజ్ (దీని సామర్థ్యం రోజు కు రోజు కు 10 మిలియన్ టన్ను లు) లతో పాటు, ప్రోసెస్ డ్ చీజ్ (దీని సామర్థ్యం రోజు కు 16 మిలియన్ టన్ను లు) లను ఉత్పత్తి చేస్తుంది. జున్ను ను తయారు చేసే ప్రక్రియ లో వెలికి వచ్చే పాల విరుగుడు తేట ను వే డ్రయింగ్ ప్లాంటు లో ఎండబెట్టడం జరుగుతుంది; వే డ్రయింగ్ ప్లాంటు రోజు కు 40 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని కలిగివుంటుంది.

సాబర్ డెయరి అనేది గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేశన్ (జిసిఎమ్ఎమ్ఎఫ్) లో ఒక భాగం గా ఉంది; ఇది అమూల్ బ్రాండ్ లో భాగం గా పాల ను మరియు పూర్తి శ్రేణి పాల ఉత్పత్తుల ను తయారు చేయడం తో పాటు విక్రయిస్తుంది కూడాను.

జులై 29వ తేదీ నాడు ప్రధాన మంత్రి గాంధీ నగర్ లోని గిఫ్ట్ సిటీ ని సందర్శించనున్నారు. గిఫ్ట్ సిటీ అనేది గుజరాత్ ఇంటర్ నేశనల్ ఫైనాన్స్ టెక్-సిటీ కి సంక్షిప్త నామం. ఆర్థిక సేవల ను మరియు సాంకేతికపరమైన సేవల ను ఒక్క భారతదేశానికే కాక ప్రపంచాని కి కూడా అందించే ఒక ఏకీకృత కేంద్రం గా దీనిని సంకల్పించడమైంది.

ఇంటర్ నేశనల్ ఫైనాన్శియల్ సర్వీసెస్ సెంటర్స్ ఆథారిరటీ (ఐఎఫ్ఎస్ సిఎ) యొక్క ప్రధాన కేంద్రం నిర్మాణాని కి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇది భారతదేశం లో ఇంటర్ నేశనల్ ఫైనాన్శియల్ సర్వీసెస్ సెంటర్స్ (ఐఎఫ్ఎస్ సి స్) లో ఆర్థిక ఉత్పత్తులు, ఆర్థిక సేవలు మరియు ఆర్థిక సంస్థల అభివృద్ధి కి, ఇంకా నియంత్రణ కు ఉద్దేశించినటువంటి ఒక ఐక్య నియంత్రణదారు సంస్థ అన్నమాట. ఈ భవనాన్ని జిఐఎఫ్ టి-ఐఎఫ్ఎస్ సి కి అంతకంతకు వృద్ధి చెందుతున్నటువంటి ప్రాముఖ్యాన్ని, స్థాయి ని దృష్టి లో పెట్టుకొని ఒక ప్రముఖమైన నిర్మాణం గా మలచాలని తలపెట్టడం జరిగింది.

భారతదేశం లో తొలి ఇంటర్ నేశనల్ బులియన్ ఎక్స్చేంజ్ (ఐఐబిఎక్స్) ను గిఫ్ట్-ఐఎఫ్ఎస్ సి లో ప్రధాన మంత్రి ప్రారంభించబోతున్నారు. భారతదేశం లో బంగారం యొక్క విత్తీకరణ కు ఉత్తేజాన్ని ఇవ్వడం తో పాటు గా, బాధ్యతాయుతమైనటువంటి సోర్సింగ్ కు, నాణ్యత కు భరోసా ను ఇవ్వడం సహా సమర్థమైనటువంటి ధర నిర్ణయాని కి కూడా ఐఐబిఎక్స్ దోహదం చేయనుంది. ప్రపంచ బులియన్ బజారు లో భారతదేశాని కి దక్కవలసిన స్థానాన్ని భారతదేశం చేజిక్కించుకొనేలా ఐఐబిఎక్స్ కొమ్ము కాస్తుంది; అంతేకాక, గ్లోబల్ వేల్యూ చైన్ కు నిజాయతీ ని, నాణ్యత ను సంతరిస్తుంది. ఐఐబిఎక్స్ ప్రపంచ బులియన్ ధరల ను ఒక ప్రధానమైనటువంటి వినియోగదారు దేశం రూపం లో ప్రభావితం చేసే దిశ లో అండగా ఉంటామని భారత ప్రభుత్వం చేసిన వచనబద్ధత ను సైతం ఐఐబిఎక్స్ పరిపుష్టం చేస్తుంది.

ఎన్ఎస్ఇ కి చెందిన ఐఎఫ్ఎస్ సి-ఎస్ జిఎక్స్ కనెక్ట్ ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ఇది జిఐఎఫ్ టి ఇంటర్ నేశనల్ ఫైనాన్శియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్ సి) లో నేశనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఇ) యొక్క అనుబంధ సంస్థ కు మరియు సింగపూర్ ఎక్స్చేంజ్ లిమిటెడ్ (ఎస్ జిఎక్స్) కు మధ్య ఒక ఫ్రేమ్ వర్క్ అన్నమాట. కనెక్ట్ లో భాగం గా, సింగపూర్ ఎక్స్చేంజ్ సభ్యులు నిఫ్టీ డెరివేటివ్స్ లో పెట్టే ఆర్డర్ లు అన్నిటిని ఎన్ఎస్ఇ-ఐఎఫ్ఎస్ సి కి మళ్ళించడం తో పాటు ఎన్ఎస్ఇ-ఐఎఫ్ఎస్ సి ఆర్డర్ మేచింగ్ ఎండ్ ట్రేడింగ్ ప్లాట్ ఫార్మ్ లో వాటిని మేచ్ చేయడం జరుగుతుంది. భారతదేశాని కి చెందిన మరియు అంతర్జాతీయ న్యాయాధికార పరిధుల కు చెందిన బ్రోకర్ లు, డీలర్ లు కనెక్ట్ ద్వారా ట్రేడింగ్ డెరివేటివ్స్ లో పెద్ద సంఖ్య లో పాలుపంచుకొంటారన్న ఆశ లు ఉన్నాయి. ఇది జిఐఎఫ్ టి -ఐఎఫ్ఎస్ సి లో డెరివేటివ్ మార్కెట్స్ లో లిక్విడిటీ ని పెంచగలదు. అంతర్జాతీయ ప్రతినిధుల ను మరింత మంది ని ఆకర్షించడం తో పాటు జిఐఎఫ్ టి-ఐఎఫ్ఎస్ సి లోని ఫైనాన్శియల్ ఇకోసిస్టమ్ పై ఒక సకారాత్మకమైనటువంటి ప్రభావాన్ని కూడా ఏర్పరుస్తుందని భావిస్తున్నారు.

నలభైనాలుగో చెస్ ఒలింపియాడ్ జులై 28వ తేదీ నాడు ఒక వైభవోపేతమైన ప్రారంభ కార్యక్రమాని కి సాక్షి కానుంది; ఆ రోజు న చెన్నై లోని జెఎల్ఎన్ ఇండోర్ స్టేడియమ్ లో నిర్వహించే ఒక ప్రారంభ కార్యక్రమం లో ప్రధాన మంత్రి పాల్గొని, చెస్ ఒలింపియాడ్ మొదలైంది అనే ప్రకటన ను చేస్తారు.

ప్రప్రథమ 'చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే' ను సైతం ప్రధాన మంత్రి ఈ సంవత్సరం లో జూన్ 19వ తేదీ నాడు న్యూ ఢిల్లీ లోని ఇందిరా గాంధీ నేశనల్ స్టేడియమ్ లో ప్రారంభించారు. ఈ కాగడా స్విట్జర్ లాండ్ లోని ఎఫ్ఐడిఇ (' ఫిడే ') కేంద్ర కార్యాలయాని కి బయలుదేరి పోయే కంటే ముందు గా, 40 రోజుల తరబడి దేశం లో 75 ప్రముఖ ప్రదేశాల గుండా ప్రయాణించింది; ఇది మొత్తం సుమారు 20,000 కిలో మీటర్ లు చుట్టి, మహాబలిపురాని కి చేరుకొంది.

నలభై నాలుగో చెస్ ఒలింపియాడ్ ను 2022 జులై 28 వ తేదీ మొదలుకొని ఆగస్టు 9వ తేదీ మధ్య కాలం లో చెన్నై లో నిర్వహించనున్నారు. 1927వ సంవత్సరం లో మొదలైన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల ను భారతదేశం లో తొలిసారి గా ఏర్పాటు చేయడం జరుగుతున్నది. అంతేకాదు, ఈ పోటీ లు 30 సంవత్సరాల అనంతరం ఆసియా లో ఏర్పాటవుతున్నాయి. 187 దేశాలు ఈ చెస్ ఒలింపియాడ్ లో పాల్గొంటున్నాయి. మరే చెస్ ఒలింపియాడ్ లోనూ ఇన్ని దేశాలు పాలుపంచుకోలేదు. భారతదేశం సైతం ఈ పోటీలలో ఇంతకు ముందు ఎన్నడు లేనంతగా అతి పెద్ద దళాన్ని రంగం లో మోహరిస్తున్నది. 6 జట్ల లో 30 మంది క్రీడాకారులు భారతదేశం తరపున పోటీపడనున్నారు.ప్రతిష్ఠాత్మక అన్నా యూనివర్సిటీ యొక్క 42వ స్నాతకోత్సవం జులై 29వ తేదీ నాడు చెన్నై లో జరుగనుండగా, ఆ కార్యక్రమానికి ప్రధాన మంత్రి హాజరు అవుతున్నారు. ఈ కార్యక్రమం లో, ఆయన 69 మంది స్వర్ణ పతక విజేతల కు బంగారు పతకాల ను మరియు ధ్రువపత్రాల ను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భం లో సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు కూడాను.అన్నా యూనివర్సిటీ ని 1978వ సంవత్సరం లో సెప్టెంబర్ 4వ తేదీ నాడు స్థాపించడం జరిగింది. దీనికి తమిళ నాడు పూర్వ ముఖ్యమంత్రి శ్రీ సి.ఎన్. అన్నా దురై పేరు ను ఈ విశ్వవిద్యాలయానికి పెట్టారు. ఈ విశ్వవిద్యాలయానికి తమిళ నాడు లో 13 కళాశాలలు, 494 అనుబంధ కళాశాల లతో పాటు తిరునెల్ వేలి, మదురై, కోయంబత్తూరు లలో మూడు ప్రాంతీయ ప్రాంగణాలు ఉన్నాయి.

# రూ. 410 కోట్లతో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధి : మంత్రి గంగుల

కరీంనగర్ , జులై 26: జిల్లాలోని మానేరు ఫ్రంట్‌ను దేశంలోనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆస్ట్రేలియా కు చెందిన లేజర్ విజన్ కంపెనీ, ఇండియాలోని ఎఫ్‌పీఏ కంపెనీల ప్రతినిధుల బృందానికి మానేరు రివర్ ఫ్రంట్‌లో నిర్మించే వాటర్ ఫౌంటెన్ లేజర్ షో, హంపి థియేటర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.



అనంతరం మానేరు రివర్ ఫ్రంట్ ప్రాంతాన్ని ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందంతో కలిసి మంత్రి గంగుల సందర్శించారు. వాటర్ ఫౌంటెన్ లేజర్ షోకు అనువైన ప్రదేశాన్ని సర్వే చేసి త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రూ.410 కోట్లతో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే సివిల్ వర్క్ పనులు ప్రారంభించామని..భారీ వర్షాల నేపథ్యంలో పనులు మందగించాయన్నారు. రానున్న వేసవికాలం వరకు పనుల్లో వేగం పెంచి యేడాదిన్నరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పరిసరాలను సుందరీకరించేందుకు పర్యాటక శాఖ నుంచి రూ. 100 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, మేయర్ సునీల్ రావు, కలెక్టర్ కర్ణన్ పాల్గొన్నారు.

# మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో.. టీఆర్ఎస్‌లో చేరికలు

వనపర్తి, జులై 26: టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి స్వచ్ఛందంగా టీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా జిల్లాలోని ఖిల్లా ఘణపురం మండలం షాపూర్ గ్రామానికి చెందిన పలువురు మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలాంజనేయులు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సామల ఆంజనేయులు, ఎండీ అబ్దుల్, కె.సోమ్లా నాయక్, తిరువాటి కృష్ణయ్య, గంటల శ్రీనివాసులు, రాంచంద్రయ్య, కొండలు, బాలయ్య తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ వచ్చాకే తలసరి ఆదాయం పెరిగింది : మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యపేట, జులై 26 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రం అప్పులకుప్పలా మారిందన్న కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఘాటుగా స్పందించారు. రాష్ట్ర సంపదను కేసీఆర్ పెంచుతున్నారని మంత్రి తేల్చిచెప్పారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని స్పష్టం చేశారు. కేంద్ర తప్పుడు విధానాలతో దేశ ప్రజల తలసరి ఆదాయం తగ్గిందని తెలిపారు.

తెలంగాణాలో బాధ్యతా రాహిత్యమైన, విచిత్ర ప్రతిపక్షాలు ఉన్నాయని జగదీశ్ రెడ్డి విమర్శించారు. వార్తల్లో ట్రెండింగ్ కావడం కోసం ప్రతిపక్ష నాయకులు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి ఏమీ లేక కేసీఆర్‌పై నోరు పారేసుకుంటున్నారని మంత్రి ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అప్పుల మీద పార్లమెంటులో మాట్లాడకుండా, రాష్ట్ర అప్పులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు.

కేసీఆర్ నిప్పులాంటి మనిషి

ఈడీ, సీబీఐ వంటి సంస్థలను అడ్డం పెట్టుకుని టీఆర్ఎస్ నాయకులను భయపెట్టాలని చూస్తున్నారు.. కానీ కేసీఆర్ నిప్పులాంటి మనిషి.. ఆయనను ముట్టుకోవడం ఎవరి వల్లా కాదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ జోలికి వస్తే బీజేపీ నాయకుల చిట్టా విప్పుతామని హెచ్చరించారు.

విలీన గ్రామాలపై స్పందన

విలీన గ్రామాల ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి జగదీశ్ రెడ్డి సూచించారు. ఏడు మండలాలను బీజేపీ కుట్రతో ఆంధ్రాలో విలీనం చేసిందన్నారు. అక్కడి ప్రజలు రెండు రాష్ట్రాల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్నారని పేర్కొన్నారు. భౌగోళికంగా ఉన్న ప్రజల అభ్యంతరాలపై ఆలోచించాలని మంత్రి సూచించారు.

సీఎం రమేశ్‌కు అవగాహన లేదు..

కాళేశ్వరం ప్రాజెక్టు, భద్రాచలంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన సీఎం రమేశ్ వ్యాఖ్యలపై కూడా మంత్రి జగదీశ్ రెడ్డి స్పందించారు. కాళేశ్వరం ఎక్కడుందో.. భద్రాచలం ఎక్కడుందో తెలియకుండా సీఎం రమేష్ మాట్లాడుతున్నాడని తెలిపారు. వరద నీటితో ప్రాజెక్ట్ పైభాగం లేక కింది భాగం మునుగుతుందో అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తగా గవర్నర్ వ్యవహారం

రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఒక బీజేపీ కార్యకర్తగా వ్యవహరిస్తుందని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. తమిళిసై గవర్నర్‌లా ఉండకుండా.. రాజకీయ నాయకురాలిగా మాట్లాడుతుందని ధ్వజమెత్తారు. కేసీఆర్ రాష్ట్ర, కేంద్ర రాజకీయాలపై గవర్నర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. రాజకీయ కార్యకలాపాలకు రాజ్‌భవన్ కేంద్రంగా మారుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.

# ఈటెలకు ఏ సిద్ధాంతం లేదు : ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

హైదరాబాద్, జులై 26: బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ది వ్యాపార నైజం.. ఆయనకు ఏ సిద్ధాంతం లేదని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. కమ్యూనిస్ట్ కమ్యునలిస్ట్‌గా మారారని విమర్శించారు. గజ దొంగల పార్టీలో చేరిన ఈటెల నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలు బాల్క సుమన్, వివేకానంద, ముఠా గోపాల్‌తో కలిసి గువ్వల బాలరాజు టీఆర్ఎస్ ఎల్పీలో మీడియాతో మాట్లాడారు.

అనామకుడైన ఈటెలను సీఎం కేసీఆర్ మంత్రిని చేశారని బాలరాజు గుర్తు చేశారు. ఈటెలకు బీజేపీలో ఏం ప్రత్యేకత ఉందని ఆయనతో ఇతర పార్టీల వారు టచ్‌లో ఉంటారని ప్రశ్నించారు. రాజేందర్‌కు దమ్ముంటే.. ఆయనతో టచ్‌లో ఉన్నవారి పేర్లను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణలో ఎదగడానికి అవకాశం లేదన్నారు. తెలంగాణలో బీజేపీ సింగిల్ డిజిట్ కూడా దాటదని స్పష్టం చేశారు. తెలంగాణ లో ప్రభుత్వాన్ని పడగొట్టడం మోదీ జేజమ్మ తరం కూడా కాదని బాలరాజు తేల్చిచెప్పారు.

# ఈటెలపై ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ధ్వజం



హైదరాబాద్, జులై 26: హుజురాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ విశ్వాస ఘాతకుడు అని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ధ్వజమెత్తారు. ఆయన తిన్నింటి వాసాలను లెక్కబెట్టారని మండిపడ్డారు. 2004కు ముందు ఈటెల అడ్రస్ ఎక్కడ..? ఈటెలను మంత్రి చేసింది కేసీఆర్ కదా? అని సుమన్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, కేపీ వివేకానందతో కలిసి బాల్క సుమన్ టీఆర్ఎస్ ఎల్పీలో మీడియాతో మాట్లాడారు.

ఈటెల రాజేందర్ మాటలను చూసి జనం నవ్వుకుంటున్నారని సుమన్ పేర్కొన్నారు. ఆయన శిఖండి రాజకీయాలు చేస్తున్నారు. ఆరోగ్య మంత్రిగా, ఆర్థిక మంత్రిగా ఈటెల అవినీతికి పాల్పడ్డాడని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో హుజురాబాద్‌లో రాజేందర్ ఓటమి ఖాయమన్నారు. అందుకే గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. ఈటెల కేసీఆర్‌పై పోటీ చేసే సిపాయా? అని ప్రశ్నించారు. ఆయన ఓ చెల్లని రూపాయి అని విమర్శించారు. పబ్లిసిటీ కోసమే ఈటెల ఈ తంటాలు పడుతున్నారని పేర్కొన్నారు. బీజేపీలో ఈటెలది బానిస బతుకు అని తెలిపారు.

**గవర్నర్‌పై మండిపడ్డ సుమన్**

గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ బీజేపీ కండువా కప్పుకుని రాజకీయాలు మాట్లాడితే మంచిదని బాల్క సుమన్ సూచించారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల గురించి మాట్లాడటానికి గవర్నర్ ఎవరు? అని నిలదీశారు. గవర్నర్ రాజకీయం చేస్తున్న తీరును మీడియా కూడా ఖండించాలన్నారు. గతంలో గవర్నర్లు హుందాగా ప్రవర్తించేవారు. క్లౌడ్ బరస్ట్ గురించి మాట్లాడటానికి గవర్నర్ ఏమైనా శాస్త్రవేత్తనా అని సుమన్ ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైలు ఢీకొని ముగ్గురు మృతి

హైదరాబాద్, జులై 26:హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులను వనపర్తికి చెందిన రాజప్ప, శ్రీను, కృష్ణగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో ఒకరి వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో రైల్వేస్టేషన్‌కు సమీపంలోని మూలమలుపులో పట్టాలు దాటుతుండగా.. ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం డెడ్‌బాడీస్‌ను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# మా పోరాటం కేసీఆర్‌తోనే, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కాదు: ఈటల

హైదరాబాద్, జులై 26: తెలంగాణలో బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ..ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని ఆయన అన్నారు. ఇప్పుడు మంచి రోజులు లేవని, అందుకే పార్టీలోకి ఎవరినీ తీసుకోలేదని చెప్పారు. ఈ నెల 27 తర్వాత చేరికలు పెద్ద సంఖ్యలో ఉంటాయని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఈటల జోస్యం చెప్పారు.

టీఆర్ఎస్ కు చెందిన ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఈటల చెప్పారు. తమ పోరాటం కేవలం కేసీఆర్ తో మాత్రమేనని? టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కాదని అన్నారు. కేసీఆర్ అహంకారాన్ని అందరికంటే ముందు తాను ఎదిరించానని? ఇప్పుడు తన బాటలో నడిచేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున వల్ల? ఇప్పుడే టీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే నియోజకవర్గంలో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందనే కారణం వల్ల వారు బహిర్గతం కాలేకపోతున్నారని అన్నారు.

టీఆర్ఎస్ పార్టీలోని సహచరులతో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని? ప్రతి ఒక్కరూ తనతో టచ్ లో ఉన్నారని ఈటల చెప్పారు. కాంగ్రెస్ పార్టీవి మాటలే తప్ప, కేసీఆర్ ను ఎదుర్కొనే సత్తా ఆ పార్టీకి లేదని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరవచ్చని అభిప్రాయపడ్డారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే కేసీఆర్ పై పోటీ చేసి ఆయనను ఓడిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్‌పై గెలుస్తాననే మాటలు కట్టిపెట్టాలి- కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, జులై 26: తెలంగాణలో కేసీఆర్ ను గద్దె దించుతామని బీజేపీ నేతలు అంటున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే కేసీఆర్ పై పోటీ చేసి ఓడిస్తానని బీజేపీ నేత ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఈటలపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ, హుజూరాబాద్ నియోజకవర్గ నేత పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్ కాలి గోటికి కూడా ఈటల సరిపోడని ఆయన అన్నారు. హుజూరాబాద్ లో ఈటలకు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. కేసీఆర్ పై గెలుస్తాననే మాటలు పక్కన పెట్టాలని? సొంత నియోజకవర్గం హుజూరాబాద్ నుంచే పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. హుజూరాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని ఛాలెంజ్ చేశారు. ఉప ఎన్నిక తర్వాత హుజూరాబాద్ లో కనీసం లక్ష రూపాయల అభివృద్ధి అయినా చేశారా? అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కళాకారుడు శ్రీనివాస్‌కు ఆత్మీయ సన్మానం



రాజన్న సిరిసిల్ల, జులై 26 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన ప్రాంతీయ కళాకారుడు శ్రీనివాస్ ముదిరాజ్ కు తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సంస్థ వారి జాతీయ మహా నంది పురస్కారం వరించడం పట్ల ముదిరాజ్ ఆటో యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ముదిరాజ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కళాకారుడు శ్రీనివాస్ కు శాలువాతో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారుడు శ్రీనివాస్ ముదిరాజ్ ముద్దు బిడ్డగా లఘు చిత్రాలు, జానపద పాటలలో రాణిస్తూ అత్యుత్తమ నటనను కనబరుస్తుండడం అభినందనీయమని, ఆయన కళకు ఇలాంటి పురస్కారాలు మరెన్నో వరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో

ముదిరాజ్ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు బొడిగె నర్సయ్య, ముదిరాజ్ అధ్యక్షులు లిక్కిడి జితేందర్, ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి లాలమోహన్, క్యాషియర్ ప్రభాకర్, ఉప్పుల కిషన్, శ్యామ్ కుమార్, ముదిరాజ్ కుల బాంధవులు పాల్గొన్నారు.

# టీడీపీ హోంమంత్రికి ఎదురుదెబ్బ.. అర్బన్ ఎన్నికల్లో టీడీపీ హవా

అమరావతి, జులై 26: ఏపీ హోం మంత్రి తానేటి వనితకు ఎదురుదెబ్బ తగిలింది. ఆమె స్వంత నియోజకవర్గమైన కొవ్వూరు అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో అధికార వైసీపీ బలపరిచ్చిన వారెవరూ పోటీలో కనిపించలేదు. ఇది తానేటి వనితకు చెదు అనుభవంగా రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

కొవ్వూరు అర్బన్ బ్యాంక్‌కు జరిగిన ఎన్నికల్లో 11 డెరెక్టర్ స్థానాలను టీడీపీ బలపర్చిన అభ్యర్థులు ఏకగీ్రవంగా గెలుపొందారు. నూతన డైరెక్టర్లంతా కలిసి టీడీపీ నాయకుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణను ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. దీంతో మద్దిపట్ల శివరామకృష్ణ వరుసగా ఐదోసారి బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే మద్దిపట్ల నాలుగుసార్లు బ్యాంక్ చైర్మన్‌గా కొనసాగారు. ఈ సారి ఎలాగైనా మద్దిపట్లను ఓడించేందుకు కృషిచేయాలని తానేటి వనిత పార్టీ శ్రేణులకు సూచించింది.

త్రీమాన్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఎన్నికలు వాయిదా వేసే ప్రయత్నాలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుల వ్యూహాలను పసిగట్టడంలో హోంమంత్రి వనిత విఫలమయ్యారు. ఇటీవల తిరుపతి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో గెలిచిన తరహాలోనే ఈ ఎన్నికల్లోనూ గెలుస్తామని వైసీపీ నేతలు భావించారు. కానీ అలా జరగకపోవడంతో ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు సమాచారం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి తానేటి వనిత 25 వేల మెజార్టీతో గెలుపొందారు.

# పాఠశాలలకు జిల్లాస్థాయి స్వచ్ఛత అవార్డుల ప్రధానోత్సవం



రాజన్న సిరిసిల్ల, జులై 26 (నేటినిజం ప్రతినిధి): 2021–22విద్య సంవత్సరమునకు గాను స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ జిల్లా స్థాయి అవార్డుల కొరకు 35 పాఠశాలలను ఎంపిక కాగ మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సత్య ప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డులను ఎంపికైనపాఠశాలలప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ గారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో పాఠశాలలో విద్యార్థులు పరిశుభ్ర వాతావరణంలో ఉండే విధంగా చూడాలని పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థులు అనారోగ్యం బారినపడకుండా చూడవచ్చని తెలియజేశారు. ఇదే వేదికపైన భారతి ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అచీవర్ అవార్డ్ జిల్లాలో ఎంపికైన ఆరుగురు ఉపాధ్యాయులకు అందజేయడం జరిగింది .పాఠశాలలు స్వచ్ఛత ప్రమాణాలు పాటించడంతో పాటు పాఠశాలల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొల్పడానికి మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ భారత ప్రభుత్వం వారు ప్రతి సంవత్సరం పాఠశాలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డ్స్ అందజేయడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ జిల్లా నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్ సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ పద్మజ భారతి ఫౌండేషన్ ప్రతినిధి విజయ్ కుమార్ జిల్లా సైన్స్ అధికారిఅంజనేయులు ,పాముల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ అవార్డ్ పొందడం కొరకు పాఠశాలలు ముందుగా స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డ్ కొరకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి.

ఈ విద్యాసంవత్సరం రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి 638 పాఠశాలలు ఈ అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోగా వీటిని జిల్లా విద్యాధికారి గారిచే నియమింపబడిన క్షేత్రస్థాయి పరిశీలకులు పాఠశాలలను ప్రత్యక్షంగా సందర్శించి పాఠశాలలకు స్టార్ రేటింగ్ మరియు మార్కులను ఇవ్వడం జరిగింది .రాజన్న సిరిసిల్ల జిల్లాలో 41 పాఠశాలలు ఫైవ్ స్టార్ రేటింగ్ ,206 పాఠశాలలు ఫోర్ స్టార్ రేటింగ్, 280 పాఠశాలలు త్రీ స్టార్ రేటింగ్, 77 పాఠశాలలు టూ స్టార్ రేటింగ్ మరియు 34 వన్ స్టార్ రేటింగ్ పాఠశాలలు పొందడం జరిగింది.త్రాగునీరు ,టాయిలెట్స్, సబ్బుతో చేతులుకడుక్కోవడం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, కెపాసిటీ బిల్డింగ్, కొవిడ్ 19 సంసిద్ధత అను ఆరు అంశాలను పరిశీలించి పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వడం జరిగింది.అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ సభ్యులు 8 ఓవర్ ఆల్ కేటగిరీ అవార్డ్ 27సబ్ కేటగిరి అవార్డులు తో పాటుగా 14 పాఠశాలలను రాష్ట్ర స్థాయికి నామినేట్ చేయడం జరిగిందని జిల్లావిద్యాధికారితెలియజేశారు.

# అల్ఫోర్స్ సీబీ యస్ఇ హైస్కూల్లో ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు

## -యన్ సి సి ఉత్తీర్ణులైన ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం






కరీంనగర్ , జులై 26: (నేటినిజం ప్రతినిధి): అల్ఫోర్స్ హైస్కూల్ – సి.బి.యస్.ఇ కొత్తపల్లి , అల్ . ఫ్లోర్స్లో ఘనంగా కార్గిల్ విజయదివాస్ వేడుకలు నిర్వహించారు అలాగే యన్.సి.సి విద్యార్థులకు ప్రశంస పత్రాల పంపిణి భారతదేశంలోని పౌరులు అందరు సుఖవంతమైన జీవితాన్ని అన్ని సౌకర్యాలతో అనుభవిస్తున్నారని మరియు ప్రజలందరు వారి కార్యకలాపాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా లాభదాయంగా నిర్వర్తిస్తున్నారని అందుకు ప్రధాన కారణం సైనికులే అని శ్రీ కల్నల్ అజయ్ కుమార్ కమాండింగ్ ఆఫీసర్ , 9 వ బెటాలియన్ తెలంగాణ , అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి . నరేందర్ రెడ్డి గారు మరియు శాతవాహన లయన్స్ క్లబ్ కార్యక్రమాల సమన్వయ కర్త డా కెప్టెన్ బి . మధుసుదన్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్ ( సి.బి.యస్.ఇ ) లో వేడుకగా ఏర్పాటు చేసినటువంటి దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించినటువంటగి కార్గిల్ విజయదివాన్ ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా హాజరై వారు మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అత్యున్నత స్థాయి కల్గిన వారు సైనికులని మరియు వారు చేసే త్యాగాలు చారిత్రాత్మకమైనవని మరియు వెలకట్టలేనివని అభిప్రాయపడుతూ దేశానికి అన్నివేళలా అన్ని కోణాలలో కంటికి రెప్పలా కాపాడుతూ దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేది వారేనని చెప్పారు . అత్యంత కీలక పరిస్థితి నుండి సాధారణ పరిస్థితి వరకు సైనికులు కీలక పాత్ర పోషిస్తారని వారు చెప్పారు . కార్గిల్లో సైనికులు పోరాడిన తీరు ప్రపంచంలో సువర్ణ అక్షరాలతో లిఖింపబడినదని తెలుపుతూ యుద్ధంలో పాల్గొన్న ప్రతి సైనికుడు అతి తక్కువ వయస్సు కలవారని జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించకుండా దేశ త్యాగానికి తలొగ్గి మనకు మార్గదర్శకులుగా నిలిచారని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు . ప్రస్తుత ప్రపంచంలో సైనికులు వారి కార్యకలాపాల చేత అత్యుత్తమ శిఖరాలను అధిరోహిస్తున్నామని మరియు అభివృద్ధిలో వివిధ దశలు దాటుతున్నామని వారు చెప్పారు . విద్యార్థులు ప్రాథమిక దశనుండే దేశ భక్తిని పెంపొందించుకొని రాజ్యంగం నిర్దేశించిన హక్కులు మరియు విధులు సక్రమంగా నిర్వర్తించి ఆదర్శంగా ఉండి దేశానికి వెన్నుదన్నుగా ఉండాలని వారు సూచించారు . యన్.సి.సి కార్యకలాపాలు చాలా శ్రేయస్సుకరమైనవని మరియు ఖ్యాతిని పెంపొందించే విధంగా ఉంటాయని చెప్పారు . అల్ఫోర్స్ విద్యాసంస్థలో యన్.సి.సి కార్యకలాపాలు క్రమబద్ధీకరంగా కొనసాగించడం చాలా అభినందనీయమని మరియు విద్యార్థులు యన్.సి.సి సంభందిత వ్యవహారాల్లో దీటుగా పాల్గొని దేశ సైన్యానికి సహకారం అందించాలని వారు చెప్పారు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్గిల్ విజయదివాన్ భారతదేశానికి ఒక గొప్ప ప్రతీక అని మరియు సైన్యానికి , వారు చేసే త్యాగాలకు వందనం చేసే రోజు అని చెప్పారు . ప్రపంచంలో మరే యుద్ధం జరగని తీరు కార్గిల్ యుద్ధంలో జరిగినదని ఎంతో మంది సైనికులు అసువులు బాసారని మరియు దేశ రక్షణకై వెనుకాడలేరని చెప్పారు . కార్గిల్లో వీర మరణం పొందిన సైనికులకు ఘనమైన పుష్పాంజలిని మరియు వారి కుటుంబ సభ్యులకు దేశం ఎళ్ళవేలల సహాకరిస్తుందని చెప్పారు . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యన్.సి.సి ఎ సర్టిఫికెట్ పరీక్షలలో ఉతీర్ణులైన వారికి పత్రాలను పంపిణీ చేశారు మరియు దేశానికి అన్ని వేలలా ప్రత్యేకంగా యువతలో ఉత్సాహాన్ని నింపుతూ పలు సామాజిక కార్యక్రమాలకు ఆకర్షితులు చేస్తున్న కల్నల్ ని ఘనంగా సన్మానించారు . విద్యార్థులుప్రదర్శించినటువంటి సైనికుడా ఓ వీర సైనికుడా నీకు వందనం , నాదేశం పుణ్యదేశం , సైనికుడా నీవు లేదు మరణం మాకు ఆదర్శనీయుడివి నృత్యాలు ప్రత్యేక ఆకర్షనీయంగా నిలిచాయి . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు .,

# పోర్టులను రాష్ట్రాలే అభివృద్ధి చేసుకోవచ్చు.. కేంద్రం జవాబు

న్యూఢిల్లీ, జులై 26: భారతీయ పోర్టుల చట్టాన్ని సవరిస్తూ తీసుకురాబోతున్న కొత్త బిల్లు వల్ల మైనర్ పోర్టులపై రాష్ట్రాలు తమ ఆధిపత్యాన్ని కోల్పోవని పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ తెలిపారు. ఇండియన్ పోర్ట్స్ బిల్లు 2022 ద్వారా మైనర్ పోర్టులపై ఇప్పటి వరకు ఆయా రాష్ట్రాలు చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందా అని రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా మాత్రమే పోర్టల చట్టాన్ని సవరించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. కొత్తగా ప్రతిపాదించిన పోర్టుల బిల్లుపై ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా ఇప్పటికే పలు దఫాలు తీర ప్రాంత రాష్ట్రాలతో తమ మంత్రిత్వ శాఖ సంప్రదింపులు జరిపినట్లు సోనోవాల్ తెలిపారు. ఈ సంప్రదింపులలో ఆయా రాష్ట్రాలు చేసిన పలు సలహాలు, సూచనలను ముసాయిదా బిల్లులో పొందపరిచారు. ఈ బిల్లు ద్వారా ఆయా రాష్ట్రాలు తమకు నచ్చిన విధంగా పోర్టుల రంగాన్ని అభివృద్ధి చేసుకునే వెసులుబాటు ఉందని మంత్రి పేర్కొన్నారు. ఎప్పుడో 1908లో తీసుకువచ్చిన ఇండియన్ పోర్ట్స్ చట్టంలోని అనేక అంశాలకు కాలదోషం పట్టింది. నౌకా వాణిజ్యం, రేవుల అభివృద్ధి, నిర్వహణలో సాధించిన పురోగతికి అవి ఏమాత్రం అనుగుణంగా లేవు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆధునికతో కూడిన క్రియాశీలమైన మార్పులతో ఇండియన్ పోర్ట్స్ బిల్లు 2022ను ప్రతిపాదిస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ బిల్లు అంతర్జాతీయ బాధ్యతలకు అనుగుణంగా దేశంలోని రేవుల సుస్థిరాభివృద్ధిని కాంక్షిస్తుంది. అలాగే తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రం పరస్పర సహాయ సహకారాల ద్వారా పోర్టుల అభివృద్ధికి ఈ బిల్లు దోహదం చేస్తుందని మంత్రి చెప్పారు.

తిరుపతిలోని సిద్ధ రీసెర్చ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ రీసెర్చ్ యూనిట్లు ఔషధ మొక్కలపై పరిశోధన, అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసినవేనని ఆయుష్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం శ్రీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా బదులిస్తూ ఈ విషయం తెలిపారు. ఔషధ మొక్కలపై ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రెండు పరిశోధనా కేంద్రాలు పని చేస్తున్నాయి. ఏపీలో ప్రత్యేకంగా ఔషధ మొక్కల పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసే ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ పలు కేంద్ర ప్రభుత్వ రీసెర్చ్ కౌన్సిళ్ళ సహకారంతో ఔషధ మెక్కల పరిశోధన, అభివృద్ధి కోసం పలు రాష్ట్రాల్లో పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్స్ (సీసీఆర్ఏఎస్)లో భాగంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 14 చోట్ల పరిశోధనా కేంద్రాలను నెలకొల్పిందని మంత్రి తెలిపారు. అదే విధంగా సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ కింద 5 రాష్ట్రాల్లో, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి కింద మూడు రాష్ట్రాల్లో, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ సిద్ధ కింద మూడు రాష్ట్రాల్లో రీసెర్చ్ కేంద్రాలు ఏర్పాటు చేసామని మంత్రి పేర్కొన్నారు

# కొడుకును ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో జాయిన్ చేసిన ఏపీ ఐఏఎస్

అమరావతి, జులై 26: కర్నూలు జిల్లా కలెక్టర్ ఇటీవల తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా.. తాజాగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ఐఏఎస్ తన కుమారుడిని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో జాయిన్ చేసింది. ఇలా ఐఏఎస్‌లు తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పిస్తుండటంతో ప్రజలు వారిని అనుసరిస్తున్నారు. దాంతో ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు ఊపందుకుంటున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కూడా కల్పిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని పరిశీలకులు చెప్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బీ నవ్య పనిచేస్తున్నారు. ఈమె కుమారుడు శ్రీకర్ ప్రతీక్. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్నాడు. కుమారుడిని మల్లి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్‌లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నది. ఏపీ సర్కార్ విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నదని, రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు చదువుకునేందుకు కావాల్సిన వసతులు ఉన్నాయని ఐఏఎస్ అధికారిణి బీ నవ్య తెలిపారు. తాను కూడా గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూళ్లోనే చదువుకుని ఐఏఎస్ స్థాయికి ఎదిగానని చెప్పారు.

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అందుతున్న సదుపాయాలతో పాటు విద్యాబోధన సంతృప్తికరంగా ఉన్నందునే తన కుమారుడ్ని కర్నూలు బుధవారపేటలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చేర్పించినట్లు కర్నూలు కలెక్టర్ కోటేశ్వర్‌రావు ఇటీవల మీడియాకు వెల్లడించారు. తాను స్వయంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పరిస్థితులను సమీక్షించి సంతృప్తి చెందినట్లు ఆయన చెప్పారు. ఐఏఎస్ అధికారులు ఇద్దరూ తమ పిల్లల్ని ఇలా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్పించడం పట్ల ఏపీ ప్రజలు అభినందిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగతా అధికారులు తమ పిల్లల్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ముందుకు వస్తారని ఆశిస్తున్నారు.

# జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్.ఐ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు మాక్ టెస్ట్



రాజన్న సిరిసిల్ల, జులై 26 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్.ఐ ఉద్యోగాల కొరకై సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఒక ప్రకటనలో తెలిపారు.×ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 05:00 లోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో లేదా 6303922572 కి వాట్సాప్ ద్వారా వారి పూర్తి వివరాలుపేరు,విలేజ్, మండలం, జిల్లా, మొబైల్ నెంబర్)తో నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారికి ఈ నెల 31 తేదీన ఆదివారం రోజున అగ్రహారం డిగ్రీ కళాశాలలో మాక్ టెస్ట్ నిర్వహించబడునని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.×

# విద్యార్థులకు వస్తువుల పంపిణీ...



రాజన్న సిరిసిల్ల, జులై 26 (నేటినిజం ప్రతినిధి): రుద్రంగి మండల కేంద్రంలో ఎస్సి బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మంగళవారం వార్డెన్ రవీంద్ర స్వామి బెడ్ షీట్లు. కార్పెట్స్. ప్లేట్లు. గ్లాసులు.స్పోర్ట్స్ షూ. టవల్స్. వాటర్ బాటిల్స్. ఏకరూప దుస్తులు. నైట్ డ్రెస్ ల తో పాటు అన్ని వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ రవీంద్ర స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అన్ని రకాల వస్తువులతో పాటు ప్రతిరోజు ఉదయం అల్పాహారం. నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం విద్యార్థులకు చికెన్ బిర్యాని ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పాలు. కోడిగుడ్లు. పండ్లను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు,

# టాటా హిటాచీ ఐదు టన్నుల వీల్ లోడర్ జెడ్డబ్ల్యు 225 విడుదల




హైదరాబాద్, జులై 26: టాటా హిటాచీ ఖరగ్‌పూర్ ప్లాంట్ నుంచి సరికొత్త ఐదు టన్నుల వీల్ లోడర్ జెడ్డబ్ల్యు225ని విడుదల చేసినట్లు టాటా హిటాచీ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సింగ్ తెలిపారు. జపనీస్ సాంకేతికతతో కూడిన మేడ్–ఇన్–ఇండియా మెషిన్ అన్నారు. మొదటి రెండు మెషీన్‌లను టాటా హిటాచీ కస్టమర్ వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అందజేశామన్నారు. పెట్టుబడిపై రాబడి పరంగా కస్టమర్‌లకు అత్యుత్తమ విలువను అందించడంలో టాటా హిటాచీ నిబద్ధతకు ఉదాహరణ అన్నారు. అత్యాధునిక వినూత్న సాంకేతికతలతో నిండి ఉందన్నారు. ఇంధన సామర్థ్యంపై రాజీ పడకుండా అసాధారణమైన ఉత్పాదకతను అందించగల సామర్థ్యం కలదన్నారు. యంత్రం ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆపరేటర్ సౌలభ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. టాటా హిటాచీ జెడ్ డబ్ల్యు225 అనేది సీఈవీ–ఐవీ ఉద్గార నిబంధనలకు కట్టుబడి ఉండే కమ్మిన్స్ ఇంజిన్‌తో ఆధారితం అన్నారు. పర్యావరణ అవసరాలు, పరిశుభ్రమైన పర్యావరణంపై మా దీర్ఘకాలిక నిబద్ధతకు ఉదాహరణ అన్నారు. సమర్థవంతమైన, శక్తివంతమైన కమ్మిన్స్ ఇంజిన్ దాని సాటిలేని పనితీరుతో ఇంధన ఖర్చులు, నిర్వహణ అవసరాలను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. టాటా హిటాచీ టీమ్‌కి నిరూపితమైన జపనీస్ టెక్నాలజీతో భారతదేశంలో తయారు చేసిన సరికొత్త ఐదు టన్నుల వీల్ లోడర్ మెషీన్‌ను విడుదల చేయడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు. టాటా హిటాచీ అసమానమైన ఉత్పాదకత, విశ్వసనీయత, బహుముఖ ప్రజ్ఞను కలిగి ఉందన్నారు. ఇది వీల్ లోడర్, అభివృద్ధి చెందుతున్న నిర్మాణ మైనింగ్ పరిశ్రమ డిమాండ్‌లకు అనుగుణంగా ఉంటుందన్నారు. కస్టమర్ అవసరాలకు సరిపోయేలా ఆటోమేటిక్ బకెట్ లెవలర్, ఆటో , ఆటోమేటిక్ ఫ్లోట్, ఎయిర్ కండీషనర్ మొదలైన అనేక రకాల జోడింపులు, ఫీచర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వెనుక వీక్షణ కెమెరా, ఆటోమేటిక్ సెంట్రలైజ్డ్ లూబ్రికేషన్ సిస్టమ్, ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టమ్, క్యాబిన్ ఫ్రంట్ గార్డ్ మొదలైన భద్రతా అంశాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇన్‌బిల్ట్ ఇన్‌సైట్ టెలిమాటిక్స్ సూట్‌తో వస్తుందన్నారు. ఇది మొబైల్ ఫోన్‌లలో రోజువారీ వినియోగం, ఇంధన స్థాయి, అలారాలు హెచ్చరికలు వంటి అన్ని సంబంధిత సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఎనిమితిబివ వెబ్, యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉందన్నారు.

బాలల కవితా సంకలనానికి
కవితలకు ఆహ్వానం
విశ్వసాహితీ మరియు అఖిలభారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంయుక్తంగా
75 సంవత్సరాల స్వాతంత్ర్య అమృతోత్సవం
పండుగ సందర్భంగా ప్రచురించదలచిన
బాలల కవితా సంకలనానికి
10-15 సం॥ వయసు బాల బాలికలనుండి
కవితలకు ఆహ్వానం
★ కవిత 10-15 లైన్లకు మించరాదు
★ పేరు, క్లాస్, ఫోన్ నంబర్ మొదలైన వివరాలు
★ 9618895543 వాట్సప్ నంబరుకు పంపవలెను.
ఆఖరు తేదీ: 25-7-2022
ఆగస్టు రెండవ వారంలో ఈ కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుంది
బాల కవులకు సర్టిఫికెట్, కవితల పుస్తకం ప్రదానం చేయడం జరుగుతుంది.
అధ్యక్షులు–కార్యవర్గ సభ్యులు
విశ్వసాహితీ మరియు ఎ.బి.బి.యస్.యస్.
సాహితీ సాంస్కృతిక సంస్థలు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.